ప్రజాశక్తి

బుధవారం 28 మే 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

పొగాకు రైతులను ఆదుకోవాలి

- ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా పొగాకు కొనుగోలు చేయించాలి
- ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం సమావేశం డిమాండ్



మాట్లాడుతున్న వి.కృష్ణయ్య

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రభుత్వ రంగసంస్థల ద్వారా పొగాకు కొనుగోలు చేయించి రైతుల ఆత్మహత్యలను నిలువరించాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఒంగోలులోని ఎల్బీజీ భవన్‌లో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ప్రకాశం జిల్లా కమిటీ విస్తత సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు జుజ్జూరు జయంతి బాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు వి.కష్ణయ్య మాట్లాడారు.

పొగాకు కంపెనీలు కొనుగోలు చేయనందున ఇప్పటికే నల్ల బర్లీ పొగాకు రైతులు నలుగురు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు ప్రక్రియ ఇదేరీతిగా కొనసాగితే ఇంకా ఆత్మహత్యలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర మంత్రులు ఆర్భాటం చేయడం తప్ప పొగాకు కొనుగోలుకు చర్యలు తీసుకోకపోవడం సహించరాని అంశమని అన్నారు. వ్యవసాయాన్ని కార్పొరేటీకరణ చేసే ప్రక్రియలో భాగంగానే ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తూ కాలయాపన చేస్తోందని విమర్శించారు. రైతుల ఆందోళనతో ఆత్మహత్యకు పాల్పడవద్దని, ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి పోరాటాల్లోకి రావాలని సూచించారు.

రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు మాట్లాడుతూ ఇటీవల రైతు సంఘం ప్రతినిధులు వేలం కేంద్రాల వద్దకు పర్యటించడం, ధరల అమలు తీరును పరిశీలించినట్లు చెప్పారు. వర్జీనియా పొగాకు రేట్లు క్రమంగా తగ్గుతున్నాయని లోగ్రేడ్ పొగాకు అస్సలు కొనడం లేదని తెలిపారు. కంపెనీలు వర్జీనియా పొగాకు సగటు ధరను తగ్గించే వ్యూహంలో ఉన్నాయన్నారు. ఇదే తీరు కొనసాగితే బ్యారన్‌కు రూ.నాలుగు లక్షల నుండి ఐదు లక్షల వరకు నష్టం చేకూరుతుందన్న ఆందోళనలో రైతులు ఉన్నట్లు తెలిపారు. రైతులను ఆదుకోవడానికి ▶ 2లో

ఏడాదిలో ఏం చేశాం.?

- హామీల అమలుపై పాలకపక్షంలోనే అంతర్మథనం
- వెలిగొండ, మార్కాపురం జిల్లా ఏర్పాటుపై చర్యలు శూన్యం
- జిల్లా డెయిరీ, కీలక రంగాలపై ఇప్పటికీ దృష్టి పెట్టని పాలకపక్షం
- మహానాడులో జిల్లా ప్రస్తావనపై ఏమిటి? ఎలా? ఎప్పుడు?..ఇదే చర్చ

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చి.. ఏడాది కావస్తోంది. వచ్చే నెల 12వ తేదీకి ప్రమాణస్వీకారం చేసి తొలి ఏడాది ముగియనుంది. రెండో ఏడాదిలోకి అడుగు పెడు తోంది. అదే సమయంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మహానాడు జరుపుకుంటోంది. గడిచిన వారం రోజులుగా నియోజకవర్గ, ఆ తర్వాత జిల్లా మహానాడు పండుగలను చేసుకున్నారు. ఆ సభల్లో నేతల ఉపన్యాసాలు చూస్తే అంతా గొప్పలే తప్ప ఆచరణలో ఏం చేశామన్నదీ ఎక్కడా స్పష్టత లేదు. నిరంకుశ పాలన పోయిందని, ప్రజలు తమకు గెలిపించారని చెప్పుకున్నారు. చంద్రబాబు పాలనపై అందరూ పొగడ్తలతో ముంచెత్తారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలనే మళ్లీ ప్రజలకు గుర్తుచేసి వాటిని తీర్మానాలు చేశారు. అంటే ఏడాదిలో ఏం చేశామన్నదే ఇప్పుడు పాలకపక్ష నేతలు సమాధానం చెప్పలేని పరిస్థితి.

సాధారణ పాలన తప్ప ఆశించిన స్థాయిలో పాలనలో వేగం లేదు. అమరావతి ఎజెండానే వినిపించింది. ఈ సారి దాని ప్రభావం ఇక్కడ ఏ రంగంపైనా కనిపించలేదు. రియల్ ఎస్టేట్ రంగం పడకేసింది. ఇక ఏడాదిలో ఏం జరిగిందన్న దానిపై నిజంగానే పాలకపక్షంలో అంతర్మథనం కనిపిస్తోంది. ఏ రంగానికీ నిధుల్లేవు. ఏ పనులు చేపట్టలేకపోయారు. ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ ఇప్పటికీ ముందుకు సాగలేదు. కీలకమైన వెలిగొండపై స్పష్టత లేదు. ఏడాదిలో దీన్ని పూర్తి చేస్తామన్నారు. ఏడాది ముగుస్తోంది. రెండో ఏడాదిలోకి అడుగు పెడుతున్నా దానికి ఇంత వరకూ నిధుల్లేవు. రూ.నాలుగు వేల కోట్లు కేటాయించాల్సి ఉంటే రూ.వంద కోట్లు లేదా రూ.రెండు వందల కోట్లు చూపుతున్నారు. నిర్వాసితులకు ప్యాకేజీలు ఇవ్వలేదు. అక్కడ నుంచి బయటకు వస్తే తప్ప రిజర్వాయర్‌కు నీళ్లు రావు. వర్షాలకు వచ్చిన నీళ్ల కూడా అక్కడ నిల్వ ఉండే పరిస్థితి లేదు. వెలిగొండను పూర్తిగా వదిలేశారన్న చర్చ సాగుతోంది. ఈ అంశంపై అక్కడ పార్టీ శ్రేణుల్లోనూ అసంతృప్తి ఉంది. మార్కాపురం జిల్లా మరో కీలక ఎజెండా. దీనిపైనా ఏడాదిగా మౌనం కొనసాగుతోంది. కాలయాపన తప్ప దానిపై సీరియస్‌గా దృష్టి పెట్టలేదు. ఇంకా ▶ 2లో

ముప్వావారిపాలెం పరిసరాలలో

చిరుత సంచారం.?

భయాందోళనలో రైతులు

ప్రజాశక్తి-చీమకుర్తి

మండలంలోని ముప్వావారిపాలెం, మర్రిపాలెం, ఎల్.రాజుపాలెం పరిసర ప్రాంతాలలో చిరుత పులి సంచరిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. గత వారం రోజులుగా ఆయా గ్రామాల పరిసరాలలో ఉన్న సామాజిక వనాలు సుబాబుల్, సరుగుడు, జామాయిల్ తోటలు ప్రాంతాలలో చిరుత సంచారం గుర్తించినట్లు పలువురు గొర్రెల కాపరులు చెప్పారు.

వారం క్రితం ఎల్.రాజుపాలెం చెందిన రావులపల్లి వెంకట్రావు అనే గొర్రెల కాపరి కారుమంచి కాలువ దాటి సరుగుడు తోట ప్రాంతాలలో గొర్రెలను మేపుతున్నాడు. అదే సమయంలో ఒక చిరుత పులిని 20 కుక్కలు వెంబడించి తరమటాన్ని చూసి.. ఆయన భయపడి గొర్రెలు తోలుకొని వెళ్లిపోయాడు. ఈ విషయం పరిసర గ్రామాల ప్రజలకు తెలియడంతో ఆ ప్రాంతాలకు ప్రజలు అటు వెళ్లడం మానుకున్నారు. సోమవారం సాయంత్రం ముప్వావారిపాలెంకు చెందిన రెడ్డిబోయిన సురేష్ ఎల్.రాజుపాలెం వెళ్లి మోటర్‌సైకిల్ పై రోడ్డుపై వస్తుండగా కారుమంచి కాలువ దిగువ కొంత దూరం వెళ్లాక ఎదురుగా చిరుత పులి రావడానికి గమనించి బండి దిగాడు. మోటార్ సైకిల్ లైటు వేసేసరికి చిరుత పులి రోడ్డు దిగి పక్కకు వెళ్ళిపోయింది. ఈ విషయం ఈ ప్రాంతాలలో రైతులలో, గ్రామస్తులలో భయాందోళన గురిచేసింది. ఈ విషయమై ఫారెస్ట్ అధికారులకు రైతులకు తెలియపరిచినా వారు సరైన ఆధారాలు చూపితేనే వస్తామని చెబుతున్నట్లు తెలిసింది. ఇప్పటికైనా ఫారెస్ట్ అధికారులు పరిసర ప్రాంతాలను తనిఖీ చేసి చిరుత పులిని బంధించాలని ప్రజలు కోరుతున్నారు. ముప్వావారిపాలెం, ఆర్ఎల్ పురం, మర్రిపాలెం, భూసురపల్లి పరిసర ప్రాంతాలలో సామాజిక వనాలు వేలాది ఎకరాలలో సాగు చేయడం వల్ల జంతువుల సంచారానికి అనువుగా ఉంది. వందల సంఖ్యలో జింకలు కూడా సంచరిస్తున్నాయి.

147 మందికి షోకాజ్

- గృహ నిర్మాణ పురోగతిలో నిర్లక్ష్యం
- సచివాలయ సిబ్బంది పనితీరుపై కలెక్టర్ వెంకటమురళి ఆగ్రహం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా



కలెక్టర్ వెంకటమురళి

గృహ నిర్మాణాల పురోగతి విషయంలో విధుల పట్ల నిర్లక్ష్యంగా 57 మంది సచివాలయాల సిబ్బందికి, ఎస్సీలకు అదనంగా రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు రుణం ఇస్తున్నా.. అక్కడ కూడా గృహాలలో పురోగతి లేకపోవడంపై మరో 92 మంది సచివాలయాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు. పక్కా గహ నిర్మాణాల లక్ష్యాలపై జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బందితో మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ వెంకటమురళి మాట్లాడుతూ పక్కా గహాల నిర్మాణాలలో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు చేరుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం మంజూరు చేసిన పక్కాగృహాల నిర్మాణాలలో పురోగతి లేకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. గహ నిర్మాణాలలో పురోగతి కనిపించాలని, ప్రస్తుతం లెంటిల్ దశలో ఉన్నవి స్లాబ్ దశకు, స్లాబ్ వేసినవి నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూన్ 10వ తేదీన మెగా గృహప్రవేశాల కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా బాపట్ల జిల్లాలోనూ నిర్మాణాలు పూర్తిచేసిన వాటిని ప్రారంభించాలన్నారు. ఇందుకోసం 8,299 గహాలు పూర్తి చేయాలనే ఉద్దేశంతో లక్ష్యాలను ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. ఇప్పటివరకు 3,240 గహాలు పూర్తిచేసిన విషయాలను అధికారులు కలెక్టర్ దష్టికి తెచ్చారు. మిగిలిన వాటిని ఎందుకు పూర్తి చేయలేదని మండల స్థాయిలో అధికారులను నిలదీశారు. 2,303 గహాలకు వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని ఆదేశించారు. వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణ లక్ష్యాలలోనూ పురోగతి కనిపించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు.

నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణ లోపంతోనే నిర్మాణాలలో జాప్యం జరుగుతోందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ మరింత పెరగాలని అధికారులకు సూచనలు చేశారు. పి.ఎం.ఎ.వై పథకం–2.0లో లబ్ధిదారులకు పొజిషన్ ధ్రువీకరణ, ఆదాయం, కుల ధ్రువీకరణ పత్రాలు తక్షణమే జారీ చేయాలని ఆర్డీవోలు, తహశీల్దార్లను ఆయన ఆదేశించారు. ఉపాధి హామీ కింద 90 రోజుల పని దినాలను లబ్ధిదారులకు వర్తింపజేయాలన్నారు. సమావేశంలో జిల్లా గహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ వై.వెంకటేశ్వరరావు, మండల ప్రత్యేక అధికారులు, ఈఈలు, డిఈలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.



సత్యతో కలిసి మంత్రి అనగానికి చెక్కు అందజేస్తున్న జనార్ధన్

మహానాడుకు

ఎమ్మెల్యే దామచర్ల విరాళం

రెవెన్యూ మంత్రికి రూ.25 లక్షల చెక్కు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కడపలో జరుగుతున్న తెలుగుదేశం పార్టీ పసుపు పండుగ మహానాడుకి ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధనరావు రూ.25 లక్షల విరాళం ఇచ్చారు. ఇందుకు సంబంధించిన చెక్కును కడపలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎమ్మెల్యే దామచర్ల మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగే మొట్టమొదటి మహానాడును తెలుగుదేశం పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకొని ఏర్పాట్లు చేస్తుందన్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి కడప వచ్చే వారికి బస, భోజన ఏర్పాటులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

వర్షం కురిస్తే.. రహదారి జలమయం!

ప్రధాన రహదారికి లేని మురుగుకాలువ • ప్రజలకు తప్పని అసౌకర్యం

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మున్సిపాలిటీలో ప్రధాన రహదారుల్లో ఎస్‌వికెపి కళాశాల మార్గం ఒకటి. నిత్యం రద్దీగా ఉండే రహదారి కూడా ఇదే. ప్రాధాన్యత కలిగిన రహదారిలో ఒక వైపు మాత్రమే మురుగు కాలువ నిర్మించారు. మరో వైపు మురుగు కాలువ నిర్మాణాన్ని మరిచారు. మురుగు కాలువలు రహదారికి ఇరువైపులా లేని కారణంగా వర్షాల సమయంలో రహదారి ఆసాంతం జలమయంగా మారుతోంది. ఫలితంగా ప్రజలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది.

మార్కాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు మొక్కుబడిగా అప్పుడప్పుడు జరుగుతుంటాయి. ప్రజలకు అత్యవసరమైన పనులను గుర్తించడంలో పాలకులు, అధికారులు విఫలమవుతూనే ఉన్నారు. 1964లో మున్సిపాలిటీ ఏర్పడింది. అప్పటి నుంచి నేటికీ ప్రధాన రహదారిలో మురుగు కాలువ లేదు. మార్కాపురం పట్టణంలోని పాత బస్టాండు మొదలుకొని ఎస్‌వికెపి కళాశాల వరకు జనావాసాలు పెరిగాయి. ఎస్‌వికెపి కళాశాల రహదారి వ్యాపారమార్గంగా మారిపోయింది. పెద్ద పెద్ద షాపింగ్‌మాల్స్ అందుబాటులోకి వచ్చాయి. వ్యాపార మార్గం కావడంతో నిత్యం వేలాదిగా ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. వాహనాలు కూడా అదే స్థాయిలో ప్రయాణిస్తుంటాయి. రహదారికి పడమటి వైపు మాత్రమే



రహదారిపై నిలిచిన వర్షపు నీరు

మురుగు కాలువ నిర్మాణం జరిగింది. తూర్పు దిక్కున కూడా మురుగు కాలువ అవసరం ఉన్నప్పటికీ నేటికీ నిర్మాణం చేపట్టలేదు. మున్సిపల్ అధికారులు కాలువ నిర్మాణాన్ని గుర్తించినట్లు కనిపించడం లేదు. వర్షాలు కురిసిన సమయంలో ఈ రహదారిలో ప్రయాణం భయాందోళనకు గురి చేస్తుంది. పడమటి వైపు మురుగు కాలువలో కొంత భాగం నీరు మాత్రమే ప్రవహిస్తుంటుంది. రహదారికి తూర్పు దిక్కున మురుగు కాలువ లేని కారణంగా నీరంతా రహదారిపై చెరువును తలపించేలా నిండుకుంటోంది. వాహనాల రాకపోకల సమయంలో వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. రహదారిపై ఎక్కడ గుంతలు ఉన్నాయో కూడా ఆ సమయంలో తెలియడం లేదు. వర్షం అధికంగా కురిసిన సమయంలో రహదారి మధ్యలో ఉన్న డివైడర్లు కూడా నీటిలో మునిగిన సందర్భాలు అనేకం ఉన్నాయి. అలాంటి సమయంలో వాహనాల నీటిలో మునిగిన డివైడర్లను ఢీకొన్న సంఘటనలు ఉన్నాయి. బాటసారులు సైతం అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు నీటిలో నడక సాగించాల్సి ఉంది. అదే సమయంలో వాహనాల వేగంతో మురుగు నీరు కాస్తా చిందుతోంది. ఆ మురుగు నీరు ప్రజలపై, ప్రయాణికులపై పడి ఇబ్బందిగా మారుతోంది. మురుగు నీరు రహదారులపై ప్రయాణించడంతో కంపు భరించలేకుండా ఉంది. ఇంతటి ఇబ్బందికర పరిస్థితులను మున్సిపల్ అధికారులు ఎందుకు గుర్తించడం లేదో అర్థం కావడం లేదు.

తక్షణమే కాలువ నిర్మాణం చేపట్టాలి

గంజి లింగారెడ్డి




పాత బస్టాండు మొదలుకుని ఎస్‌వికెపి కళాశాల వరకు రహదారికి తూర్పు వైపున మురుగు కాలువ లేని కారణంగా వర్షాల సమయంలో రహదారిపై ప్రవహిస్తున్న మురుగు నీటిలో నడవాల్సి వస్తోందని స్థానికుడు గంజి లింగారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రహదారిపై నిలిచిన నీటితో ప్రమాదాలు జరుగుతాయన్నారు. ప్రజల అసౌకర్యాన్ని తొలగించేందుకు మురుగు కాలువ నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.


కష్టపడి పని చేసేవారిని పార్టీ గుర్తిస్తుంది

ప్రజాశక్తి-గిద్దలూరు

కష్టపడి పని చేసేవారిని వైసీపీ గుర్తిస్తుందని మార్కాపురం మాజీ ఎమ్మెల్యే, వైసిపి గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కుందూరు నాగార్జునరెడ్డి అన్నారు. స్టేట్ ఎస్‌సి సెల్ జాయింట్ సెక్రటరీగా నూతనంగా నియమితులైన బద్దీటి ప్రవీణ్‌కుమార్ మంగళవారం కుందూరు నాగార్జునరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడచిన 11 నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజాకంటక నిర్ణయాలు తీసుకుని ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకున్నదని, భవిష్యత్తు వైసిపిదేనని, కష్టపడి పనిచేసే ప్రతి ఒక్కరినీ వైసీపీ గుర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాచర్ల మండల అధ్యక్షులు ఏలేం మురళీకృష్ణ, జడ్పీటీసీ పగడాల శ్రీరంగం, బొర్రా కృష్ణారెడ్డి, చేరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, రాచర్ల మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నాగార్జునరెడ్డిని, మురళీ కృష్ణను సన్మానిస్తున్న బద్దిటీ ప్రవీణ్



అంధకారంగా ఉన్న చిన్నగంజాం టోల్ ప్లాజా రహదారి

అంధకారంలో చిన్నగంజాం టోల్ ప్లాజా

ప్రజాశక్తి-చీరాల / చిన్నగంజాం

చీరాల ఒంగోలు జాతీయ రహదారి మార్గంలోని ఉప్పుగుండూరు టోల్ ప్లాజా వద్ద అంధకారంగా మారింది. టోల్ ప్లాజా వద్ద ఇరు వైపుల రహదారిపై విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో బాపట్ల జిల్లా నుంచి ప్రకాశం జిల్లా ఒంగోలుకు ప్రయాణిస్తున్న వాహనదారులు పలు ఇబ్బందులకు గురి అవుతున్నారు. టోల్ సిబ్బంది వాహనాలకు టోల్ ఫీజులు వసూలు చేస్తున్నారనే తప్ప టోల్ గేట్ వద్ద విద్యుత్ లైట్లు వెలగకపోయినా పట్టించుకోవడం లేదని వాహనాదారులు ఆరోపిస్తున్నారు. టోల్ గేట్ వద్ద ఉండాల్సిన కనీస వసతులను నిర్వాహకులు పూర్తిస్థాయిలో ఏర్పాటు చేయడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత 8 నెలలుగా లైట్లు వెలగడం లేదని, వెంటనే లైట్లు వెలిగే చర్యలు చేపట్టి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పొగాకు రైతులను ఆదుకోవాలి

(మొదటిపేజీ తరువాయి)

వెంటనే ప్రభుత్వం నేరుగా పొగాకు కొనుగోలు జరిపి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కె.మాబు మాట్లాడుతూ పొగాకు రైతులను ఆదుకోవడానికి రైతు సంఘం నాయకత్వాన సంఘటితంగా పోరాడతామని ప్రకటించారు. సమావేశంలో రైతు సంఘం ఉపాధ్యక్షుడు హనుమంతరావు, అబ్బూరి వెంకటేశ్వర్లు, బెజవాడ శ్రీనివాసరావు, కిష్టిపాటి చిన్నపరెడ్డి, కనపర్తి సుబ్బారావు, టి శ్రీకాంత్, ఊసా వెంకటేశ్వర్లు, డి సోమయ్య, ఎం నరసింహారావు, పి సింగయ్య, ముప్పరాజు బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఏడాదిలో ఏం చేశాం.?

(మొదటిపేజీ తరువాయి)

చెప్పాలంటే ఆ ప్రాంత నేతలు దీనిపై అప్పుడప్పుడూ మాట్లాడుతున్నారే తప్ప వైసిపి పాలనలో దీని కోసం సాగిన పోరాటాలను మరిచారు. మార్కాపురం జిల్లా ప్రాధాన్యతపై పాలకపక్షం గతంలో చూసిన శ్రద్ధ ఇప్పుడు లేదు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎన్నికల అస్త్రంగా చేసుకున్నారు. చేయాల్సిన పాత్రలోకి వచ్చేసరికి మౌనం దాల్చడం చర్చగా మారింది. ఇప్పుడు మంత్రులతో కమిటీ వేశారు. ఇది కూడా కాలయాపనకా? లేక కంటితుడుపు కోసమా? అనే చర్చ సాగుతోంది. మహానాడులో జిల్లా ఏర్పాటుపై ఏం చెబుతారన్నదీ చూడాలి. ఎప్పుడు చేస్తారనేదీ స్పష్టత ఉంటుందా? అనేదీ ఆలోచించాలి. ఇంకా కీలక రంగాలపైనా అతీగతీ లేదు. జిల్లా డెయిరీ మూతపడింది. దీనికి రూ.70 కోట్ల నిధులు అవసరమని కలెక్టర్ అన్సారియా ప్రభుత్వానికి నివేదించారు. 40 వేల మంది పాడి రైతులకు మేలు చేసే జిల్లా డెయిరీని మూతపెట్టారు. దాని ఆస్తులూ అన్యాక్రాంతమవుతున్నాయి. అమూల్ చేతికి అప్పగించారు. మనం నడుపుకోలేమా? అనే దానిపై ఇప్పటికీ చర్చ లేదు. జిల్లా డెయిరీని కాపాడుకుందామనే చర్చే లేదు. ఇక చదలవాడ వద్ద ఉన్న పశుక్షేత్రంపైనా డిఆర్‌సీలో తీర్మానం చేశారు. దీని అభివృద్ధి కూడా మొక్కుబడిగా ఉంది. రోజూ తాగునీరు ఇచ్చేందుకు ప్రతిపాదించిన తాగునీటి పథకాలకూ మోక్షం కలగలేదు. వాటి కోసం వెలిగొండ, రామతీర్థం, గుండ్లకమ్మ ప్రాజెక్టుల వద్ద రూ.5 వేల కోట్లతో పథకాలను ప్రతిపాదించారు. నిధులు కావాలి. అసలు సాగునీటి ప్రాజెక్టులే పూర్తి కాలేదు. వాటి వద్ద ఈ పథకాలు ఏర్పాటు చేయాలి. ఇవీ ప్రశ్నార్థకంగా మారాయి. రహదారులను కొద్దిగా మరమ్మతుల చేపట్టినా జిల్లా కేంద్రం నుంచి పశ్చిమప్రాంతానికి వెళ్లే ఒంగోలు-కర్నూలు రహదారి విస్తరణకు నోచుకోలేదు. కొత్తగా వేస్తున్న జాతీయ రహదారులతో ఎటువెళ్లినా జనానికి టోల్ బాదుడు తప్పడం లేదు. పాత బ్రిడ్జీలు కూలిపోయేలా ఉన్నాయి. కూలే దాకా కట్టే పరిస్థితి ఇప్పట్లో కనిపించడం లేదు. ఏడాదిలో అభివృద్ధిపై దృష్టి లేదు. పెట్టినా నిధుల్లేవు. ఏడాదిలో ఇసుక సమస్యను కొలిక్కి తేవడానికి పెద్ద యుద్ధం చేయాల్సి వచ్చింది. రేషన్ మాఫియా, మద్యం మాఫియా, గ్రానైట్ దందాలు తెరపైకి వచ్చాయి. వీటితోనే పాలకపక్ష నేతలు తన్నుకుంటున్నారు. హత్యలకు దారితీస్తున్నాయి. వీటిని ఏ గొప్పలుగా చెప్పుకుంటారన్నదే ప్రశ్నగా మారింది. ఆధిపత్య పోరు, కాంట్రాక్టులు కోసం పేచీలు, మద్యం దుకాణాలు, బెల్టు దుకాణాల వేలం పాటలు వంటి వాటితో గ్రామాల్లో పార్టీ శ్రేణుల్లోనూ అసంతృప్తి పెరిగింది. పేచీలు తీర్చలేక ఎమ్మెల్యేలు తలలు పట్టుకుంటున్నారు. పాలన కూడా గాడిలో పడలేదు. కూటమి సర్కార్ ఎక్స్‌ప్రెస్ పట్టాలపైనే ఉన్నా వేగం పుంజుకోవడం లేదన్న చర్చ ఉంది. నియోజకవర్గాల్లో ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు కాలేదు. దీంతో ఎమ్మెల్యేల్లోనూ జనానికి ఏం చెప్పాలనే దానిపై అసంతృప్తి ఉంది. నిధుల కోసం మంత్రులు చుట్టూ తిరుగుతున్నారు. ఏదో చేద్దామని తపన ఉన్న ఎమ్మెల్యేలకూ నిధులపై స్పష్టత దొరకడం లేదు. వామపక్ష పార్టీల ఆందోళన ఫలితంగా జిల్లాను వెనుకబడిన జాబితాలో పెట్టినా కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో నిధులు రాలేదు వాటి కోసం ప్రయత్నాలూ లేవు. మహానాడుల్లో గత హామీలనే మళ్లీ తీర్మానాలు చేసుకున్నారు. రాష్ట్ర మహానాడు మొదలైంది. అక్కడ జిల్లా ప్రస్తావన ఎలా ఉంటుందనేదీ చూడాలి.

ప్రజాశక్తి
బుధవారం 28 మే 2025

నీటికుంటలో జారిపడి యువకుడు మృతి



అఖిల్ (ఫైల్ ఫొటో)



మృతి చెందిన ఆలేటి అఖిల్



యువకుడిని బలిగొన్న నీటి కుంట

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం యర్రగొండపాలెం సమీపంలోని రెస్ట్ రూం దగ్గర్లో 565 జాతీయ రహదారి పక్కన జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. యర్రగొండపాలెం మండలంలోని వీరభద్రాపురం గ్రామానికి చెందిన ఆలేటి అఖిల్ (22) అనే యువకుడు మరో యువకునితో కలిసి యర్రగొండపాలెం సమీపంలోని మార్కాపురం రహదారిలో గల రెస్ట్ రూం దగ్గర 565 జాతీయ రహదారి పక్కన జరుగుతున్న షెడ్డు నిర్మాణంలో బేల్దార్ పనికి వెళ్లాడు. కాగా అతనితో వచ్చిన మరొక కూలీ కొంచెం సేపు పని చేసి మరలా వస్తానని యర్రగొండపాలెం వెళ్లాడు. అయితే మధ్యాహ్నం వరకు బేల్దార్ కూలీగా పునాది గుంతల్లో రాళ్లు పరిచిన ఆలేటి అఖిల్ (22) మధ్యాహ్నం కావడంతో కాళ్లు, చేతులు కడుక్కొని భోజనం చేసేందుకు పక్కనే ఉన్న పెద్ద నీటి కుంట దగ్గరకు వెళ్లాడు. నీటి కుంటలో పట్ట పరచి దాని నిండా పొలం యజమాని నీళ్ల పట్టి ఉంచాడు. అయితే కాళ్లు కడుక్కునే క్రమంలో పట్ట జారి ఆలేటి అఖిల్ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడిపోయాడు. కుంట బాగా లోతుగా ఉండడంతో అడుగుకు చేరుకున్నాడు. యర్రగొండపాలెం వచ్చిన మరో కూలీ పని ముగించుకొని ఆలేటి అనిల్ పని చేస్తున్న దగ్గరకు వెళ్లాడు. అక్కడ అఖిల్ కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెతికాడు. నీటి కుంట దగ్గర అఖిల్ చెప్పులు కనిపించాయి. దీంతో కుంటలో పరీక్షించి చూడగా అఖిల్ విగత జీవిగా కనిపించాడు. భయంతో ఆ కూలీ విషయాన్ని అఖిల్ కుటుంబీకులకు చేరవేశాడు. దీంతో పోలీసులు, అఖిల్ బంధువులు, ఫైర్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. అఖిల్‌ను బయటకు తీశారు. అప్పటికే అఖిల్ చనిపోయి ఉన్నాడు.

చేతికొచ్చిన కొడుకు శవమయ్యాడు..

తమ రెండో సంతానమైన అఖిల్‌ను అల్లారుముద్దుగా పెంచుకున్నామని, డిప్లొమో వరకు చదివించామని, వేసవి సెలవుల్లో ఖాళీగా ఉండలేక బేల్దారి పనులకు వెళ్తామంటే మేమే పాపమని, ప్రయోజకుడై తమను పోషిస్తాడనుకున్నామని తల్లిదండ్రులు డేవిడ్, వెంగమ్మలు గుండెలవిసేలా విలపించారు. వారిని ఓదార్చడం ఎవరి తరం కాలేదు. అఖిల్ గ్రామమైన వీరభద్రాపురం ప్రజలు కూడా ఘటనా స్థలానికి తండోప తండాలుగా వచ్చారు. దీంతో ఆ ప్రాంత మంతా అర్తానాధాలతో మారుమోగింది. యర్రగొండపాలెం ఎస్సై పి.చౌడయ్య సంఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కాగా గతంలో కూడా గోళ్లవిడిపి గ్రామంలో కూడా నీటి కుంటలో పడి ముగ్గురు చిన్నారులు మృతి చెందారు. మాజీ మంత్రి సురేష్ గేస్ట్ హౌస్ సమీపంలోని నీటి కుంటలో పడి మరొకరు చనిపోయారు. ఇలా ప్రతియేటా నీటి కుంటల ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. పలువురు మృత్యువాత పడుతూనే ఉన్నారు. అయినా వాటికి కంచెలు ఏర్పాటు చేయకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపినా అధికారులు పట్టి పట్టనట్లు వ్యవహరించడంతో ఈ ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా నీటి కుంటల చుట్టూ కంచెలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరుగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కంటెయినర్

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-టంగుటూరు

మండలంలోని సూరారెడ్డిపాలెం వద్ద పచ్చాకు ట్రాక్టర్‌ను కంటెయినర్ లారీ ఢీకొనడంతో నలుగురికి గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం ఉదయం హైవేపై జరిగింది. టంగుటూరు ఎస్ఐ కథనం మేరకు.. పచ్చాకు లోడుతో సూరారెడ్డిపాలెం నుంచి తూర్పునాయుడుపాలెం ట్రాక్టర్ వెళ్తోంది. కూలీలు ట్రక్కు సైడున కూర్చుని వున్నారు. ఒంగోలు నుంచి చెన్నయి వైపుకు వెళుతున్న కంటైనర్ వాహనం ట్రక్కును ఢీకొనడంతో గట్లపూడి వెంకటేశ్వర్లు, కూలిపోగు జక్కరయ్య, అనపర్తి మార్కు, గర్లపూడి రాములుకి గాయాలయ్యాయి. క్షతగాత్రులను హైవే అంబులెన్స్‌లో రిమ్స్ వైద్యశాలకు తరలించారు. కంటైనర్ లారీని చిలకూరు వద్ద స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-మద్దిపాడు

లారీని వెనక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఆరుగురు గాయపడ్డారు. ఈ ఘటన మండల పరిధిలోని దొడ్డవరప్పాడు గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఎస్సై వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం జిల్లా భద్రాచలంకు చెందిన ఓ కుటుంబం దైవ దర్శనానికి వెళ్లి తిరిగి ఒంగోలు నుంచి గుంటూరు వైపు వెళుతున్న క్రమంలో వేకువజామున ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న కారు ఢీకొనడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. వారిని ఒంగోలు రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

ఎన్‌కౌంటర్ మృతదేహాల అంత్యక్రియలపై విచారణ చేపట్టాలి

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

నారాయణపూర్ ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన సిపిఐ (మావోయిస్టు) పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావుతో సహా 27 మంది మృతదేహాలకు పోలీసులు నిర్వహించిన అంత్యక్రియల ప్రక్రియపై విచారణ చేపట్టాలని సిపిఐ (ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నట్లు రాష్ట్ర అధికార ప్రతినిధి చిట్టిపాటి వెంకటేశ్వర్లు మంగళవారం పేర్కొన్నారు. ఎన్‌కౌంటర్ వార్త తెలిసినప్పుటి నుండి నంబాల కేశవరావు సోదరులు, బంధువులు వారి భౌతిక కాయాల కోసం ఆసుపత్రి దగ్గర పడిగాపులు కాశారని పేర్కొన్నారు. పోస్టుమార్టం జరిగిన తర్వాత ఇస్తామని ఒకసారి, ఒంటి గంట తర్వాత ఇస్తామని మరోసారి అబద్ధాలు చెబుతూ కాలయాపన చేశారని విమర్శించారు. మంత్రి అచ్చం నాయుడు కూడా వారిని బెదిరించడం, మందలించడం వంటి పరిణామాలు రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ కుట్రలో భాగస్వామ్యం అయిందని భావించాల్సి వస్తుందన్నారు. శవాలను అప్పగిస్తే వాటిపై ఉన్న గాయాలవల్ల కొన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయనే భయంతోనే పోలీసులు సాక్ష్యం లేకుండా చేయడానికి ఈ దుర్మార్గానికి ఒడిగట్టారని ఆరోపించారు. తక్షణమే ఈ సంఘటనపై ఉన్నత స్థాయి న్యాయ విచారణ జరిపించాలని, మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని, ఆపరేషన్ కగారును నిలిపేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.



ప్రవహిస్తున్న సాగర్ జలాలు

తాగునీటి చెరువులకే సాగర్ జలాలు

ప్రజాశక్తి-దర్శి

తాగునీటి చెరువుల నింపేందుకే సాగర్ నీరు విడుదల చేసినట్లు దర్శి ఎన్ఎస్పీ డిఇ పూర్ణచంద్ తెలిపారు. ఈ సందర్భంగా దర్శి-కురిచేడు రోడ్డులో గల ఒంగోలు బ్రాంచ్ కెనాలకు మంగళవారం 998 క్యూసెక్కులు నీరు విడుదలైనట్లు ఆయన తెలిపారు. దర్శితోపాటు కనిగిరి దూపాడు ముటుకుల చందవరం-1, చందవరం-2, లక్ష్మీపురం మొదలగు 11 చెరువులు లిఫ్ట్ ద్వారా తాగు నీటి చెరువులకు పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు. నోటిఫైడ్ చెరువులకు కాకుండా వేరే చెరువుకు గాని పంటలకు గాని నీటిని విడుదల చేయటం లేదని ఎవరైనా అలాంటి చర్యలు చేపడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సిపిఎం సీనియర్ సభ్యుడు మోషే మృతి

నివాళులర్పించిన సిపిఎం నేతలు



నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

ప్రజాశక్తి-కొండపి

సిపిఎం సీనియర్ సభ్యుడు, ముఖ్య కార్యకర్త లక్కపోగు మోషే సోమవారం ఒంగోలు రిమ్స్ ఆసుపత్రిలో అనారోగ్యంతో మృతి చెందారు. మృతి వార్త తెలియగానే సిపిఎం జిల్లా కార్యదర్శి ఎస్కే మాబు ఆస్పత్రికి చేరుకొని మోషేకు నివాళులర్పించారు. మంగళవారం సాయంత్రం పెరిదేపి గ్రామంలో మోసే భౌతిక కాయంపై సిపిఎం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా మోషే సిపిఎం సభ్యుడిగా, కార్యకర్తగా అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని అన్నారు. ప్రజా ఉద్యమాల్లో అనేక ఒడిదుడుకులు ఎదురైనా, కడవరకు కమ్యూనిస్టుగా నిలబడటం సాధారణ విషయం కాదని అని అన్నారు. కామ్రేడ్ మోషే మృతి ప్రజా ఉద్యమాలకు, సిపిఎంకు తీరనిలోటని అన్నారు. మోషేకు జోహార్లు అర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య, గంటెనపల్లె వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు కేజీ మస్తాన్, జి.శ్రీనివాసులు, మల్లెల రమేష్, మండల కార్యదర్శి మల్లెల కొండయ్య, మండల కమిటీ సభ్యులు ముప్పరాజు చిన్న బ్రహ్మయ్య, ఎం.చిన్న పేతురు, ఏ.సూరిబాబు, ఎల్ పరిశుద్ధ రావు, మండల నాయకులు అంగలకుర్తి బ్రహ్మయ్య, ఎం.పెద్ద పేతురు, గుమ్మల్ల వెంకటేశ్వర్లు, గడ్డం వందనం, జి.పిచ్చయ్య, పుట్టా రామారావు, రావిపాటి నర్సింగరావు, ఇనకొల్లు నరసింహ రావు, వేజెండ్ల సింగయ్య, ఎల్ దావీదు, అంగలకుర్తి కోటేశ్వరరావు, ఎల్.కొండయ్య, ఎల్.ప్రసాద్, మల్లికార్జున్ తదితరులు అంత్యక్రియలలో పాల్గొన్నారు.

బదిలీలపై వెళ్లేందుకు వీఆర్వోల యత్నం

పని ఒత్తిడే కారణం

ప్రజాశక్తి-కురిచేడు

కురిచేడు మండలంలో రెవిన్యూ అధికారులపై వస్తున్న ఒత్తిడికి తట్టుకోలేక మండలంలోని కొంతమంది రెవిన్యూ అధికా రులు బదిలీ చేయించుకొని ఇతర మండ లాలకు పోవడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కురిచేడు మండలంలో డిప్యూటీ తహశీల్దారుగా పనిచేస్తున్న రామానా యుడు, యం.ఆర్.ఐ.గా పనిచేస్తున్న నాగరాజు తమకున్న పరిచయాలను ఉపయోగించుకొని ఇతర చోట్లకు బదిలీ కావడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే పడమర వీరాయపాలెం వీఆర్వోను బదిలీ చేయడానికి అధికార పార్టీ నాయకులు అధిష్టానంపై తీవ్రమైన ఒత్తిడి చేస్తున్నారు. ముఖ్యంగా తహశీల్దారుగా పని చేస్తున్న బి.రజినీ కుమారిని మండల టీడీపీలో ఒక వర్గం నాయకులు తాము చెప్పిన వారికి పనులు చేయడం లేదని ఇక్కడ ఆమె తహశీల్దారుగా పనిచేస్తే పార్టీకి నష్టం జరుగుతుందని బదిలీ చేసి కొత్త అధికారిని నియ మించాలని కోరుతుండగా మరో వర్గం వారు మాత్రం తహశీల్దారు రజిని కుమారి సమస్యలతో కార్యాలయానికి వస్తున్న ప్రజలను వారికి ఉన్న ఇబ్బందులను తెలుసుకొని సమస్యల పరిష్కారం చేస్తున్నారని ఇటువంటి తహశీల్దారును బదిలీ చేయడం సరైన నిర్ణయం కాదని అధిష్టా నం వద్ద తమ వాదనను వినిపిస్తున్నారు. రెండు వర్గాల వాద నలు విన్న దర్శి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారుల బదిలీలకు పచ్చజెండా ఊపుతారో లేదా వారినే కొనసాగే విధంగా చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

అక్రమ లావాదేవీలపై విచారణ జరపాలి

ప్రజాశక్తి-శింగరాయకొండ



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

శింగరాయకొండలో అక్రమ లావాదేవీలతో విచారణ జరపాలని కలెక్టర్ తమీమ్ అన్సారియాకు ఎమ్మార్పీఎస్ నాయకులు ఫిర్యాదు చేశారు. సుమారు 50 కోట్ల విలువైన భూమిని అన్యాక్రాంతం చేసిన పాపిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబంపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకుడు రేణుమాల మాధవ కోరారు. ప్రభుత్వ నిబంధనలకు భిన్నంగా అసైన్‌మెంటు భూముల చట్టం ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శింగరాయకొండ కేంద్రంగా జరుగుతున్న ప్రభుత్వ భూముల కొనుగోలు, అమ్మకాలపై తగిన ఆధారాలు సేకరించి చర్యలు చేపట్టాలని కోరారు. శింగరాయకొండ, గుడ్లూరు, కొండాపురం, బుచ్చిరెడ్డిపాలెం, విజమూరు, కందుకూరు, సంతనూతలపాడు మండలాలలో విలువైన భూములు, ఆస్తులు అక్రమంగా చట్టవ్యతిరేకంగా అధికారుల అండతో చేస్తున్నారని ఆధారాలతో కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పని చేసిన రెవెన్యూ అధికారుల అండదండలతో సొంతం చేసుకున్న సుమారు 50 కోట్లు విలువైన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని తగిన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

కుటుంబ కలహాలతో

ఉరేసుకొని మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి-దర్శి

భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో క్షణికావేశంలో మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని తూర్పు వీరయిపాలెంలో మంగళవారం జరిగింది. అందిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చెరుగూరి వెంకటరత్నం (30) తన భర్త బాల సుందర రాజు నిన్న రాత్రి గొడవ జరిగింది. అన్నం ఎందుకు వండలేదు అని అడిగినందుకు ఆమె మనస్తాపం చెంది క్షణికావేశంలో మంగళవారం తెల్లవారు జామున ఇంట్లో ఉరి వేసుకొని మృతి చెందింది. వెంకటరత్నం తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్శి ఎస్సై ఎం.మురళీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతురాలికి భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు.



పొగాకు మండెలను పరిశీలిస్తున్న ఐటిసి కంపెనీ ప్రతినిధులు

పొగాకు మండెలు పరిశీలన

ప్రజాశక్తి - యద్దనపూడి

మండల పరిధిలోని యనమదల, సూరవరపుపల్లి అనంతవరం గ్రామాల రైతులకు సంబంధించిన నల్లబర్లీ పొగాకు మండెలను జిపిఐ కంపెనీ ప్రతినిధులు రైతులు మంగళవారం పరిశీలించారు. గ్రేడింగ్ చేసి చెక్కులు కట్టుకొని కంపెనీ వద్ద తీసుకురావాలని రైతులకు సూచించారు. గ్రామంలో అక్కడక్కడ పరిశీలించి వెళ్లడంతో ఇతర రైతుల తమ పొగాకు మండెలు చూడలేదని అందువల్ల కొనుగోలు చేయరేమోనని ఆందోళన చెందుతున్నారు. రైతుల అందరి వద్ద పొగాకును పరిశీలించి గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని వారు కోరారు. పొగాకు మండెలను పరిశీలించిన వారిలో జిపిఐ కంపెనీ ప్రతినిధులు అవినాష్, రేణు బాబు ఇతర సిబ్బంది, రైతులు గుంజి పాపారావు, శ్రీనివాస్, సుబ్బారావు, సీతయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కారంచేడు ఇఒపిఆర్‌డిగా కృష్ణ

ప్రజాశక్తి -కారంచేడు

కారంచేడు మండల ఇఒపిఆర్‌డిఒగా లింగిశెట్టి కృష్ణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆదిపూడి పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న కష్ణ ఇఒపిఆర్‌డిగాబాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కష్ణ మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ , జిల్లా పంచాయతీ అధికారుల ఆదేశాలు, ఎంపిడిఒ, పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారుల సహకారంతో కారంచేడు మండల అభివద్ధికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.



కూలీలతో మాట్లాడుతున్న ఆంజనేయులు

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి- మేదరమెట్ల

మండల పరిధిలోని మేదరమెట్ల, ఎర్రబాలెం గ్రామాలలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను వ్యవసాయ కార్మిక సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఎం. ఆంజనేయులు మంగళవారం పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన కూలీలకు మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆంజనేయులు మాట్లాడుతూ పని దినాలు 200 రోజులకు పెంచాలన్నారు. కూలీలకు మజ్జిగ, పలుగు,పారా, తట్టా అలవెన్సులు ఇవ్వాలన్నారు. పని ప్రదేశాల్లో కూలీలకు నీడ సౌకర్యం కల్పించాలన్నారు. గత ఏడు వారాల నుంచి నుంచి కూలీకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. ప్లేచిప్పులు కూడా ఇవ్వలేదని తెలిపారు. ఎర్రబాలెంలో గత ఏడు వారాలుగా కూలీలకు వేతనాలు ఇవ్వలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

సహాయనిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి- అద్దంకి

అద్దంకి మండలం మణికేశ్వరం గ్రామానికి చెందిన గండి ఇషాంత్‌కు అత్యవసర శస్త్రచికిత్స నిమిత్తం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేక సిఫారసు చేశారు. దీంతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి ముందస్తు వైద్య ఖర్చులు నిమిత్తం రూ.80,000 మంజూరయ్యాయి. దీంతో మంత్రి గొట్టిపాటి ఆదేశాల మేరకు ఇషాంత్ తండ్రికి ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా చెక్కును మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలి

రైతు సంఘం జిల్లా నేతలు

ప్రజాశక్తి-ఇంకొల్లు

అన్నదాత సుఖీభవ పథకం కింద ప్రతి కౌలు రైతుకూ రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ జూన్ 2,3,4 తేదీల్లో తహశీల్దారు కార్యాలయాల వద్ద ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కందిమళ్ల రామ కోటేశ్వరరావు, కార్యదర్శి తలపనినేని రామారావు తెలిపారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడారు. భూ యజమానితో సంబంధం లేకుండా, యజమాని సంతకం లేకుండా కౌలు రైతులను గుర్తించాలని డిమాండ్ చేశారు. కౌలు చట్టంలో మార్పులు తీసుకొచ్చి కౌలు రైతులందరికీ అమలు చేస్తామని ఇటీవల నిర్వహించిన అసెంబ్లీ సమావేశాల్లో వ్యవసాయశాఖ మంత్రి ప్రకటించారని తెలిపారు. ప్రస్తుతం వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో సొంత భూమి కలిగిన రైతుల వివరాలనే ప్రభుత్వం సేకరిస్తున్నట్లు తెలిపారు. కౌలు రైతుల వివరాలు సేకరించకపోవడంతో ప్రభుత్వ కుట్ర ఉందనే అనుమానం వ్యక్తమవుతోందని వారు పేర్కొన్నారు. ఈ ఏడాది వ్యవసాయ సీజన్ ముందుకు జరుగుతుందని, వర్షాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అన్నదాత సుఖీభవ నిధులు వెంటనే కౌలు రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. వైసిపి ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించిన కూటమి ప్రభుత్వం పాత కౌలు చట్టాన్నే అమలు చేయడం చూస్తే మాటలు కోటలు దాటుతున్న ఆచరణ గడప దాటనట్లుగా ఉందని విమర్శించారు. పభుత్వం అన్నదాత సుఖీభవకు సంబంధించిన విధి విధానాలు ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.



మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

ప్రాసంగలపాడులో అట్టహాసంగా కోలాటం

ప్రజాశక్తి- మేదరమెట్ల

కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతి సందర్భంగా మండల పరిధిలోని ప్రాసంగలపాడు గ్రామంలో సిపిఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో సోమవారం కోలాట ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ ఆనాడు పార్టీ కోసం కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చేసిన త్యాగాలను గురించి, ప్రసంగలపాడులో తవణం చెంచయ్య చేసిన ఉద్యమాలను గురించి వివరించారు. సుందరయ్యను గుర్తు చేసుకుంటూ ఆహ్లాదకరమైన వాతావరణంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం గొప్ప విషయమన్నారు. తొలుత పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి సిపిఎం కోరిశపాడు మండల కార్యదర్శి ఎం. ఆంజనేయులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తవనం చెంచయ్య విగ్రహానికి ప్రజానాట్యమండలి పూర్వ అధ్యక్షుడు బొంతు దశరథ పూలమాలలతో నివాళులర్పించారు. తర్వాత ప్రజానాట్య మండలి మద్దిపాడు మండల బాధ్యులు ఉబ్బా ఆదిలక్ష్మి, ఉబ్బా వెంకటేశ్వర్లు, కడియం బ్రహ్మయ్య పాటలతో ఉర్రూతలూగించారు. అనంతరం 25 మంది బాల బాలికలు కోలాటం ప్రదర్శించారు. కోలాటం గురువులుగా పంగులూరు గ్రామానికి జాన్, ప్రాసంగలపాడు గ్రామానికి చెందిన డివి.రమణ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో నాతని హనుమంతరావు ,వై.రవీంద్రబాబు, యోహాన్, స్థానికులు సేవా కోటేశ్వరరావు, సేవా లక్ష్మణరావు, కంచర్ల సుబ్బారావు, కంచర్ల హరిబాబు, నందికోలు సుబ్బారావు, సుందరం, ఉబ్బా కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్. గంగయ్య

30న ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా కార్యదర్శి మజుందర్

ప్రజాశక్తి-బాపట్ల

ఈనెల 30న సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్.మజుందర్ తెలిపారు. పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సిఐటియు ఆవిర్భావించి 55 ఏళ్ళు పూర్తయిన సందర్భంగా ఈనెల 30న జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లోనూ సిఐటియు అనుబంధ సంఘాలు జెండా ఆవిష్కరణ చేసి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. 1970 మే 30 ,31 తేదీల్లో కలకత్తాలో నిర్వహించిన మహాసభల్లో సిఐటియు ఏర్పడినట్లు తెలిపారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా కార్మిక ఉద్యోగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించి కార్మిక వర్గానికి అండగా సిఐటియు నిలిచిందన్నారు. నేడు దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా జులై 9న నిర్వహిస్తున్న సమ్మెను జయప్రదం చేయడంలో సిఐటియు కీలక పాత్ర వహిస్తుందన్నారు. సిఐటియు ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతి ఘటించడానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.



కడప వేదికగా రాష్ట్ర సమగ్రాభివృద్ధికి నాంది

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ స్ఫూర్తితో ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర సమగ్రాభివద్ధి, ప్రజా సంక్షేమం దిశగా పాలన సాగిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు తెలిపారు. కడప మహానాడు కమలాపురం ఇన్‌ఛార్జి కొనసాగుతున్న ఎమ్మెల్యే ఏలూరి నాయకులు కార్యకర్తలతో మహానాడుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు ప్రజల పండుగ మహానాడు అని తెలిపారు. ఎన్‌టిఆర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని తెలుగుదేశం ప్రతి ఏటా మహానాడును అంగరంగ వైభవంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. కడప గడ్డ వేదికగా తెలుగుదేశం జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారని వెల్లడించారు. రాష్ట్ర సమగ్ర అభివద్ధి సంక్షేమానికి ఈ వేదిక ద్వారా పలు నిర్ణయాలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. పేదలను సంపన్నులుగా చేసేందుకు, అన్నదాతలను రారాజుగా నిలిపేందుకు నూతన ఆవిష్కరణలకు రూపకల్పన చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వం పని చేస్తుందన్నారు.



మహానాడులో మంత్రి గొట్టిపాట్టి, ఎమ్మెల్యే ఏలూరి

పంగులూరు : కడపలో నిర్వహిస్తున్న టిడిపి మహానాడుకు పంగులూరు మండలం నుంచి టిడిపి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలి వెళ్లారు. మండల పరిధిలోని ముప్పవరం గ్రామంలోని టిడిపి కార్యాలయం వద్ద కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు గరిమిడి జగన్మోహన్రావు, మురకొండ సుబ్బారావు , ఓబుల్ రెడ్డి మాట్లాడారు. మహానాడు విజయవంతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ముప్పవరం గ్రామ టిడిపి అధ్యక్షుడు వేల్పుల మరియదాసు, రేణింగివరం గ్రామ అధ్యక్షుడు భూమా పెద్దిరెడ్డి, బూదవాడ గ్రామ అధ్యక్షుడు మన్నే వెంకయ్య, నాయకులు ఓబుల్ రెడ్డి, గరిమిడి జగన్మోహన్ రావు, మురకొండ సుబ్బారావు ,నార్ని సుబ్బారావు, అశోక్ ,గొట్టిపాటి కాజా స్వామి, గడ్డం నాగేశ్వరరావు, అల్లం నేని బ్రహ్మానంద స్వామి, జాగర్లమూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



పంగులూరులో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

సీడాప్ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు శిక్షణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లాలోని షెడ్యూల్డు కులాలకు చెందిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో లిడ్ క్యాప్ – సీ డ్యాప్ ద్వారా వివిధ కోర్సులలో శిక్షణ ఇస్తున్నట్లు ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.అర్జున్‌నాయక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లెదర్ స్టిచ్చింగ్, ఆపరేటర్ లెదర్ కట్టర్, పుట్ వేర్ లెదర్ కట్టర్, పుట్ వేర్ వంటి వాటిలో 45 రోజుల పాటు శిక్షణ నిస్తామన్నారు. కనీసం 8వ తరగతి ఆపైన చదివిన షెడ్యూల్డు కులాల వారు ఈ శిక్షణ పొందడానికి అర్హులన్నారు. 21 సంవత్సరాల నుండి 45 సంవత్సరాల వయసు ఉన్న వారు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, కులధృవీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజు ఫొటోలతో శిక్షణకు హాజరు కావాలన్నారు శిక్షణ సమయంలో ఉచిత వసతి, ఉచిత భోజన సౌకర్యాలు కల్పిస్తామన్నారు. అందరికీ వెల్కం కిట్లు ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు కనిగిరిలో శిక్షణ కేంద్రానికి హాజరు కావాలన్నారు. ఈ నెల 26 వ తేదీ నుంది శిక్షణ తరగతులు ప్రారంభం అయినందున ఆసక్తి కలిగిన షెడ్యూల్డు కులముల అభ్యర్ధులు 9849905969, 9700663327, 7780326290 అనే నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

4052 పొగాకు బేళ్లు కొనుగోలు..

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

పొగాకు వేలం మార్కెట్ మందకొడిగానే సాగుతుంది, మంగళవారం వారం నాడు రీజియన్ పరిధిలో 5354 బేళ్లు ఆక్షన్‌కి రాగా 4052 బేళ్లు అమ్ముడుపోయాయి. వివిధ కారణాలు చూపి 960 బేళ్లను(24 శాతం) తిరస్కరించారు. బ్లాక్ సాయిల్ పరిధిలోని ఒంగోలు 1, 2, వెల్లంపల్లి, టంగుటూరు, కొండపి వేలం కేంద్రాల్లో 3442 బేళ్లు ఆక్షన్‌కు తేగా 2519 బేళ్లు కొనుగోలు చేసారు. ఇక్కడ గరిష్టంగా 736 బేళ్లు తిరస్కరించారు. కిలో రూ కనిష్ఠ ధర రూ.200, గరిష్ట ధర రూ.280 పలికింది. సగటున కిలో రూ.244.38 పలికింది. కాగా లైట్ సాయిల్ పరిధిలో పొదిలి, కనిగిరి, కందుకూరు 1,2 కలిగిరి, డిసి పల్లి కేంద్రాల్లో 1912 బేళ్లు ఆక్షన్‌కు తేగా 1536 బేళ్లు కొనుగోలు జరగ్గా, 224 బేళ్లు తిరస్కరించారు. ఇక్కడ కిలో కనిష్ఠ ధర రూ.200 కాగా, గరిష్ట ధర రూ.280 పలికింది. సగటున కిలో రూ.247.09 పలికింది.

రెడ్‌బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోంది..

- తెనాలి పోలీసుల దాష్టీకంపై వైసిపి మండిపాటు
- దళితులైన మంత్రులు ఏం సమాధానం చెబుతారు.?
- పోలీస్ దుశ్చర్యలపై మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు..


మాట్లాడుతున్న మాజీ మంత్రి సురేష్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

రాష్ట్రంలో రాజ్యాంగం మాటున రెడ్ బుక్ రాజ్యాంగం రాజ్యమేలుతోందని వైసిపి నాయకులు దుయ్యబట్టారు. మంగళవారం నాడు స్థానిక వైసిపి జిల్లా కార్యాలయంలో తెనాలిలో ముగ్గురు దళిత, మైనారిటీ యువ కులపై పోలీసులు జరిపిన హింసాత్మక చర్యలను ఖండిస్తూ నిర్వహించిన మీడియా సమావేశంలో పలువురు మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ పోలీసు అధికారులు వ్యవహరించిన తీరు ఆటవిక సంస్కృతిని తలపిస్తోందన్నారు. తెనాలి ఘటన రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుకు పరాకాష్ట అని మండిపడ్డారు. ఇటీవల ఒక కేసులో నిందితులుగా ఉన్న ఇద్దరు ఎస్సీ యువకులను ఇద్దరు సిఐలు పోలీస్ సిబ్బందితో కలసి తెనాలి పట్టణంలో అత్యంత పాశవికంగా లాఠీలతో రక్తం చిందే విధంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించిన ఘటన భయభ్రాంతులకు గురిచేస్తోందన్నారు. రాజ్యాంగ వ్యవస్థకు తలవొంపులు తెచ్చే ఈ ఘటన గురించి పోలీసుల దుశ్చర్యలపై మానవహక్కుల సంఘానికి ఫిర్యాదు చేస్తామని వారు ప్రకటించారు. పోలీస్ రిమాండ్‌లో ఉన్న (దళితులు) నిందితుల పట్ల అత్యంత క్రూరంగా పోలీస్ అధికారులు వ్యవహరించిన తీరుపై దళిత హోంమంత్రి అనిత, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ స్వామి రాష్ట్రంలోని దళిత సమాజానికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లోపించాయని, దళితులపై దాడులు మునపెన్నడూ లేని రీతిలో కొనసాగుతున్నాయని విమర్శించారు. తెనాలి ఘటన పై జ్యూడిషల్ విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైసిపి రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరి కనకారావు, వైసిపి రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు కాకుమాను రాజశేఖర్, మాజీ శాసన సభ్యులు కసుకుర్తి ఆదెన్న మాట్లాడారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ సుల్తాన్ బాషా, ఎస్సీ సెల్ అధ్యక్షులు దేవప్రసాద్, కార్పొరేటర్ ఇమ్రాన్ ఖాన్, వేమా శ్రీనివాసరావు, బడుగు ఇందిర తదితరులు పాల్గొన్నారు.

'లెగసీ వేస్ట్' ప్రాసెసింగ్ ప్రారంభం

- 66 వేల టన్నుల చెత్త ప్రాసెస్‌కు చర్యలు
- కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు


'లెగసీ వేస్ట్' ప్రాసెసింగ్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్ర ప్రభుత్వం, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా ఎంపిక చేసిన తరుణి అసోసియేట్స్ వారు గుత్తికొండవారిపాలెంలోని డంపింగ్ యార్డులో గల 66 వేల టన్నుల లేగసీ వేస్ట్ (పేరుకుపోయిన చెత్త)ని ప్రాసెసింగ్ చేసే పనిని తరుణి అసోసియేట్స్ ప్రతినిధులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గుత్తికొండవారిపాలెంలోని సుమారు 66 వేల టన్నుల లేగసీ వేస్ట్‌ని రాబోయే 3 నెలల్లో పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. లేగసీ వేస్ట్‌ని ప్రాసెస్ చేయటానికి తరుణి అసోసియేట్స్ వారు స్క్రీనింగ్ మెషిన్‌ని ఏర్పాటు చేసి.. ఈ మెషిన్ ద్వారా చెత్తని ప్రాసెస్ చేసి.. ప్లాస్టిక్, మిగిలిన చెత్తను పొడి రూపంలో వేరు చేస్తారని పేర్కొన్నారు. ఇలా వేరు చేసిన పొడిని రోడ్ల మీద ఉన్న గుంతలను పూడ్చటానికి ఉపయోగించవచ్చని తెలిపారు. ప్లాస్టిక్ చెత్తను జిందాల్ సిమెంట్ ఫ్యాక్టరీకి తరలిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమం ద్వారా వాయు కాలుష్యం, భూమి కాలుష్యం నివారించబడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఇ చంద్రయ్య, డిఇఇ పద్మజ, అనిల్, ఏఇఇ సౌజన్య, తరుణి అసోసియేట్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

అబద్ధాలతో రైతులను మోసగించొద్దు..

వైసిపి సమన్వయకర్త చుండూరు రవిబాబు


మాట్లాడుతున్న రవిబాబు

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

అబద్ధాలతో పొగాకు రైతులను మోసగించొద్దని, లేనిపోని ఆశలు కల్పించవద్దని వైసిపి ఒంగోలు నియోజకవర్గ సమన్వయకర్త చుండూరు రవిబాబు పేర్కొన్నారు. గిట్టుబాటు ధర దక్కేవరకు పొగాకు రైతులకు తమ పార్టీ అండగా నిలుస్తుందన్నారు. మంగళవారం నాడు ఆయన వైసీపీ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తమ పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డి పొగాకు రైతులను పరామర్శించేందుకు ఈనెల 28 పొదిలి పర్యటన ఖరారయిన అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజారపు అచ్చెన్నాయుడు ఇటీవల మార్టూరు రైతు కుటుంబాన్ని పరామర్శించడానికి విచ్చేసి.. 28వ తేదీ లోపు పొగాకు కొనుగోలుకు ఆదేశించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. అవసరం అయితే మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించుతామని ప్రకటించడం రైతులని తప్పుదారి పట్టించడానికేనని ఆరోపించారు. మిర్చి రైతుకు గిట్టుబాటు ధర క్వింటాకు రూ.11,780 కల్పిస్తూ ప్రభుత్వం ప్రకటించి 40 రోజులయినా జీవో రాలేదన్నారు. ప్రభుత్వం కార్పొరేట్లకు మేలు చేకూర్చేదిగా ఉందన్నారు. వర్జీనియా పొగాకు రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని గిట్టుబాటు ధర దక్కేవరకు తమ పార్టీ అండగా నిలుస్తుందన్నారు.


కర్పూరంతో ప్రయోగాలు చేయిస్తున్న దృశ్యం

సైన్స్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం కొనసాగింది. ఈ శిబిరంలో విద్యార్థులకు దాసరి లక్ష్మీప్రసాద్ సైన్స్‌పై అవగాహన కల్పించారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పలు సైన్స్ ప్రయోగాలను విద్యార్థులతో చేయించారు. శిబిరాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి సందర్శించారు. పలువురు శిక్షకులు డ్రాయింగ్, ఆర్ట్, క్రాఫ్ట్, చిత్రలేఖనం, గుడ్ హ్యాండ్ రైటింగ్, నృత్యం, యోగా మరియు స్పోకెన్ ఇంగ్లీష్ తదితర కళలలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

6న ఒంగోలు మండల సమావేశం

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

జూన్ ఆరో తేదీన శుక్రవారం నాడు ఒంగోలు మండల పరిషత్ సమావేశం నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ అభివద్ధి అధికారి కె రాజశేఖర్ రావు మంగళవారం నాడు ఒక ప్రకటన లో తెలిపారు. సమావేశానికి మండల పరిధిలోని అధికారులు, ఎంపిటిసిలు సర్పంచ్‌లు ఉదయం 11గంటలకు హాజరుకావాలని ఆయన కోరారు.

గ్రీవెన్స్ పరిష్కారం కోసం 3 టీమ్‌లు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ లో తలెత్తే సమస్యలు, సందేహాలు ఇతర అంశాలను పరిష్కారం గావించేందుకు ఉమ్మడి ప్రకాశం జిల్లాకు, మూడు టీంలను నియమించినట్లు డిఇఒ ఎ.కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ టీమ్‌లు జూన్ రెండో తేది వరకు సేవలు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వారి సేవలను వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

3.24 లక్షల డ్వాక్రా మహిళలకు

రూ.6,759.53 కోట్ల రుణాలు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

2025–26 ఆర్థిక సంవత్సరానికి డిఆర్‌డిఏ వెలుగు జిల్లాలోని 3,24,081 మంది స్వయం సహాయక సంఘ మహిళలకు రూ.6,759.53 కోట్లకు వార్షిక రుణప్రణాళిక, జీవనోపాధుల ప్రణాళికను కలెక్టర్ అమోదించినట్లు డిఆర్‌డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ టి.నారాయణ మంగళవారం నాడు ప్రకటించారు. దీనికి సంబంధించి బ్యాంక్ మేనేజర్స్‌కు, వెలుగు ఏసి, ఏపిఎంలకు వర్క్ షాప్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌హెచ్‌జి హౌస్ హెల్డ్ లెవెల్ ప్లాన్ మరియు మైక్రో క్రెడిట్ ప్లాన్ అమలుపై చర్చించామన్నారు. జిల్లాలో 4,46,026 మంది ఎస్‌హెచ్‌జి మహిళలకు వారి సొంత అవసరాలకు మరియు ఆధాయాభివద్ధి కార్యక్రమాల నిమిత్తం

డిఆర్‌డిఏ వెలుగు వార్షిక ప్రణాళిక

ప్రణాళికలు తయారు చేసినట్లు, దీనిలో భాగంగా 2,40,845 మంది మహిళలు ఆదాయాభివద్ధి కోసం రూ.3835.60 కోట్లు రుణాలు.. అలాగే 2,50,560 మంది మహిళలు రూ.2,923 కోట్ల రుణాలు.. ప్రకాశం జిల్లాలో మొత్తం 3,24,081 మంది స్వయం సహాయక సంఘ మహిళలు రూ.6,759.53 కోట్లకు వార్షిక ఋణ మరియు జీవనోపాధుల ప్రణాళికను సిద్ధం చేశామన్నారు. తయారు చేసిన వార్షిక ఋణ ప్రణాళిక ప్రకారం బ్యాంకర్స్ అందరూ ఎటు వంటి నిబంధనలు లేకుండా ఋణ మంజూరు చేయాలని, జూన్, 4 వ తేది లోపు ముఖ్యమంత్రి లక్షాధికారి మహిళల కార్యక్రమానికి జిల్లా నుండి 1720 మహిళ వ్యాపారవేత్తలకు రుణాలు ఇవ్వాలని, మహిళల పొదుపు మొత్తాన్నీ వారి అవసరాల నిమిత్తం విత్ డ్రా చేసుకోవాటానికి బ్యాంకర్స్ అడ్డుచెప్పకూడదని కలెక్టర్ ఆదేశించారని తెలిపారు. క్షేత్ర స్థాయిలో బ్యాంక్ మేనేజర్స్ మరియు వెలుగు సిబ్బంది తరచూ సమావేశాలు ఏర్పాటు చేసుకొని సమన్వయంతో పని చేయాలని సూచించారు. మహిళలు యూనిట్‌లు ఏర్పాటు చేసుకొనే నిమిత్తం బ్యాంక్ మేనేజర్ల ను అడిగిన యూనిట్‌లకు సబ్సిడీ రుణాలను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీహరి, ఎల్‌డిఎం రమేష్, అన్ని బ్యాంకుల రీజనల్ మేనేజర్స్, డి.ఆర్.డి.ఏ, డీపీఎం లు పి. సనిత, పి. డేవిడ్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - పంగులూరు

మండల పరిధిలోని ముప్పవరం, కల్లం వారి పాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి పనులను సెంట్రల్ టీం సభ్యులు పరిశీలించారు. ఢిల్లీ నుంచి వచ్చిన కేసి అండర్ సెక్రెటరీ , ఏరియా ఆఫీసర్ అనిల్ కుమార్, సెక్షన్ ఆఫీసర్ అరుణ్ కుమార్ మౌర్య ఉపాధి పనులు ,దాని అనుసంధాన పనులైన పంచాయతీరాజ్ పనులు, గహ నిర్మాణ శాఖ పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పనుల్లో ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం చూపకుండా నాణ్యత ప్రమాణాలతో పనులు జరిగేటట్లు చూడాలన్నారు. ఉపాధి పనులు అర్హులైన లబ్ధిదారులకే అందే విధంగా సిబ్బంది చూడాలన్నారు. ఎక్కడ ఎలాంటి లోపాలు జరిగిన సిబ్బంది బాధ్యత వహించాల్సి వస్తుందన్నారు. అనంతరం ముప్పవరం గ్రామపంచాయతీ పరిధిలోని పిన్నాక నాగ మల్లేశ్వరి మామిడి తోట, ఆదిలక్ష్మి పశువుల కొష్టం, ఇటీవల నిర్మించిన పల్లె పండగ సిమెంట్ రోడ్లను పరిశీలించారు. అనంతరం కల్లం వారి పాలెంలో గహ నిర్మాణ శాఖ ద్వారా కట్టిన పక్కా గహాలను పరిశీలించారు. భవనం నాగిరెడ్డి పశువుల కోష్టంను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ కోటయ్య నాయక్, డిప్యూటీ ఎంపిడిఒ సుమంత్, ఎపిఒ సంతోషం, ఎపిఎం జ్యోతి ప్రసాద్, డిపిఎం సుబ్బారావు,పంచాయతీరాజ్ ఎఇ గడ్డం హనుమంతరావు, గహ నిర్మాణ శాఖ ఎఇ కిషోర్ కుమార్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యోగా ఏరోబిక్స్ పై అవగాహన

ప్రజాశక్తి -వేటపాలెం

స్థానిక చీరాల ఇంజినీరింగ్ కళాశాలలో సిఎటిసి-4 ఎన్‌సిసి క్యాంపులో భాగంగా ఎన్‌సిసి క్యాడెట్స్‌కు యోగా ఏరోబిక్స్ సాధనపై మంగళవారం అవగా హన కార్యక్రమం నిర్వహించారు జూన్ 21న జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా యోగా పై అవగాహన కల్పిస్తూ విస్తత ప్రచారం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా పెదగంజాం మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ భవాని శ్రీనివాస్, సెంటెన్స్ స్కూల్ కు చెందిన ఎన్‌సిసి క్యాడెట్ నేషనల్ యోగా అవార్డు గ్రహీత గొర్ల పార్థసారథి, కళాశాల పీడీ, ఎన్‌సిసి అధికారి గొర్ల గోపి ఆధ్వర్యంలో ఎన్‌సిసి క్యాడెట్స్‌కు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుబేదార్ మేజర్ నజీర్ అహ్మద్, మేజర్ బిఎస్ఆర్‌కె. రాజు, బిహెచ్ఎం రమేష్, పి. సురేష్, టి. వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఫాతిమా, దివ్య తదితరులు పాల్గొన్నారు.

సారా నిర్మూలనకే 'నవోదయం-2.0'

ప్రజాశక్తి- రేపల్లె

సారా నిర్మూలనే నవోదయం 2.0 లక్ష్యమని బాపట్ల జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ, సూపరింటెండెంట్ బి. వెంకటేశ్వర్లు తెలిపారు. మండల పరిధిలోని గుడ్డికాయలంక గ్రామంలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించి సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేయాలన్నారు. సారా నిర్మూలనకు గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల సహకారం తీసుకోవాలన్నారు. గ్రామ, మండల, డివిజన్ స్థాయిల్లో ప్రత్యేకాధికారులను నియమిస్తామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో సారా నిర్మూలన చర్యలు చేపట్టాలన్నారు. సారా తయారీదారులకు గ్రామస్తులు సహకరిస్తే ఆయా గ్రామాలకు ప్రభుత్వ పథకాలు నిలిచిపోతాయని ప్రజలకు వివరించాలన్నారు. సారా తయారీని విడిచిపెట్టిన వారికి ప్రత్యామ్నాయంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. సారా తయారీకి బెల్లం సరఫరాదారులపై దాడులు నిర్వహించి కేసులు నమోదు చేయాలన్నారు. గంజాయి మాదిరిగానే సారా నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పని చేయాలని, గ్రామాల్లోని మహిళా సంఘాల సహకారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఎక్సైజ్ ఎస్ఐ దివాకర్, గ్రామ సర్పంచి ఉయ్యూరు శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, ఎక్సైజ్ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

పేదపిల్లల విద్యకు ఊతం..

- 25 శాతం ఉచితం
- సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నాగిరెడ్డి

ప్రజాశక్తి-బాపట్ల



మాట్లాడుతున్న నాగిరెడ్డి

విద్యా వ్యవస్థను బలోపేతం చేసి పేద పిల్లలకు ఉచిత విద్య అందించేందుకు జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రణాళికా బద్ధమైన కషి చేస్తోందని సమగ్ర శిక్ష అభియాన్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ నాగిరెడ్డి తెలిపారు. పాఠశాలలు పున్న ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం ఆయన మాట్లాడారు. విద్యార్థులకు క్రమశిక్షణ కలిగిన విద్యను అందించటంతో పాటు, విద్యారంగానికి ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేసేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ప్రతి పాఠశాలలో విద్యాహక్కు చట్టం అమలు జరిగేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందు కోసం ప్రతి విద్యార్థి ఇంటికెళ్లి దీని ప్రాధాన్యతను తెలియజేస్తున్నామన్నారు. పేద పిల్లలకు 25 శాతం ప్రైవేటు విద్యాసంస్థల్లో ఉచిత విద్యా బోధన జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. గత ఏడాది అడ్మిషన్ల ఆధారంగా ఈ విధానం అమలు చేయాలని సంకల్పించినట్లు తెలిపారు. బడుగు, బలహీన, బీసీ, మైనార్టీ, ఈ బీసీ, అనాథ పిల్లలకు ఈ పథకం ద్వారా ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. విద్యాశాఖ, ఐసిడిఎస్ శాఖల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా అవసరమైన ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. జిల్లాలో మొత్తం 225 ప్రైవేటు పాఠశాలలు ఉన్నట్లు తెలిపారు.ఆ పాఠశాలల ద్వారా 1904 మంది పేద పిల్లలకు ఉద్దేశించిన పాతిక శాతం రాయితీని అమలు చేయాల్సి ఉందన్నారు. దీని కింద అర్హత పొందేవారు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ద్వారా ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంటుందని తెలిపారు. పాఠశాలల్లో చేరే విద్యార్థుల కోసం అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు ఈ పథకం వెసులుబాటుగా ఉంటుందని ఆయన తెలిపారు. ప్రత్యేక అవసరాల పిల్లల కోసం జిల్లాలో 25 మండలాల్లో 25 భవిత కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన పరికరాలను అందజేయడంతో పాటు, ఇదే భవిత కేంద్రంలో వారికి నాణ్యమైన విద్యను బోధించేందుకు చర్యలు చేపట్టినట్లు చెప్పారు. సమగ్ర శిక్ష ద్వారా ప్రభుత్వ పాఠశాలలను మరింత బలోపేతం చేసేందుకు నిర్మాణాత్మకమైనకృషితో ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు నాగిరెడ్డి వెల్లడించారు.

సైన్సు లేనిదే సమాజం లేదు

- పుస్తక పరిజ్ఞానంతో మూఢ నమ్మకాలు దూరం
- డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు
- జెవివి సైన్స్ పుస్తకాల ప్రదర్శన



జెవివి పుస్తకాల స్టాల్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ గుంటుపల్లి సుబ్బారావు

ప్రజాశక్తి- చీరాల

సైన్సు లేనిదే సమాజం లేదని ఆదిమానవుడు నేటి సమాజంలో అత్యున్నత స్థాయికి ఎదిగాడంటే దానికి సైన్స్ మూల కారణమని హైమా హాస్పిటల్ ఎమ్‌డి డాక్టర్ గుంటపల్లి సుబ్బారావు తెలిపారు.స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పుస్తకాలు పిలుస్తున్నాయి అనే కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్బారావు మాట్లాడుతూ సోషల్ మీడియా ప్రభావంతో ప్రజలు పుస్తకాలు చదవడం మానేశారని తెలిపారు. పుస్తకాలు చదవడం వల్ల శాస్త్రీయ విజ్ఞానం అలవడుతుందన్నారు. మూఢ నమ్మకాలను వీడి సైన్స్ పై పరిజ్ఞానాన్ని పెంచుకొని సమాజంలో మానవుడు మరింతగా ముందుకు సాగాలన్నారు. అందుకు ఇలాంటి పుస్తకాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. విద్యార్థి దశనుండే సైన్స్ పట్ల అవగాహన కలిగి ఉంటే శాస్త్రీయ సమాజం నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. జెవివి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు మాట్లాడుతూ జ్ఞాన సంపాదనకు పుస్తకాలే సాధనాలన్నారు.నేటి సమాజంలో చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ ఆసక్తి కరంగా సైన్స్ పై మరింతగా అవగాహన పెంచే పుస్తకాలన్నీ ఈ స్టాల్స్‌లో అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. విద్యార్థులు మేధావులు ఈ పుస్తకాలు కొనుక్కొని అందులో ఉన్న విషయాలను ప్రజలకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి జిల్లా అధ్యక్షుడు భాస్కరరావు, డివిజన్ నాయకులు బిరుదు పిచ్చయ్య, హేమంత్ కుమార్, యుటిఎఫ్ బాపట్ల జిల్లా సహాధ్యక్షుడు బండి బిక్షాలు బాబు, మాల్యాద్రి కుర్రా శ్రీనివాసరావు, లింగం జయరాజు, నారప రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకులను బహిరంగంగా చితకబాదిన

పోలీసులపై చర్యలు తీసుకోవాలి : వరికూటి

ప్రజాశక్తి- వేమూరు



మాట్లాడుతున్న వరికూటి అశోక్‌బాబు

కూటమి ప్రభుత్వ పాలనలో పోలీసుల రాక్షత్వం పెరిగి పోయిందని, నేరాలు చేసిన వారిని పబ్లిక్‌గా నడిరోడ్డుపై చితకబాది నేరం చేసిన పోలీసులపై న్యాయవ్యవస్థ సుమోటోగా కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి, వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికోటి అశోక్ బాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెనాలి పట్టణంలో ఐతా నగర చెందిన దళిత యువకులను నడిరోడ్డుపై అతి దారుణంగా లాఠీలతో అరికాళ్ళకు పగలకొట్టడం దారుణమన్నారు. నేరం చేసిన వారిని పట్టుకుని కోర్టుకు అప్పగించాలే తప్ప వారిని కొట్టితే పోలీసులు కూడా నేరం చేసినట్టే కదా అని అశోక్‌బాబు ప్రశ్నించారు. టిడిపి రెడ్ బుక్ రాజ్యాంగంలో పోలీసులు కూటమి ప్రభుత్వానికి తొత్తులుగా మారి వారు చెప్పిన విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కూటమి నాయకులు నిర్వహిస్తున్న కోడిపందాలు, పేకాటకు పోలీసులు కాపలా ఉంటున్నట్లు తెలిపారు. దళిత యువకులను ఇంత దారుణంగా పబ్లిక్‌గా ప్రజలందరూ చూస్తుండగా కొట్టడం హేయమైన చర్య అని తెలిపారు. దళితులు కాబట్టే వారిని అతి దారుణంగా కొట్టారని, అదే ఇతర కులాల వారిని అయితే ఆ విధంగా కొట్టగలరా? అని ఆయన ప్రశ్నించారు. దళిత యువకులను అతి దారుణంగా కొట్టిన పోలీసులపై చర్యలు తీసుకుని విధుల నుంచి తొలగించాలని ఆయన కోరారు. రానున్న రోజుల్లో వైసిపి అధికారం చేపట్టబోతుందని అప్పుడు ఇలాంటి పోలీసులను ఏ ఒక్కరిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తెనాలి మాజీ ఎమ్మెల్యే అన్నా బత్తుని శివకుమార్, వైసిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ లేఅవుట్లు ధ్వంసం

ప్రజాశక్తి -వేటపాలెం

అక్రమ లేఅవుట్లపై తహశీల్దారు పాలపర్తి పార్వతి ఉక్కు పాదం మోపారు. అసైన్డ్ భూముల వేసిన లేఅవుట్లను రెవెన్యూ సిబ్బందితో కలిసి మంగళవారం సందర్శించారు. వేటపాలెం మండలం చల్లారెడ్డిపాలెం పంచాయతీ పరిధిలోని నాయనపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబర్ 461/1ఎలో ఎకరం 90 సెంట్ల అసైన్డ్ భూమిలో ఏర్పాటు చేసిన లేఅవుట్ హద్దురాళ్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో డిటీ దాసరి శ్రీకాంత్, సర్వేయర్ ఉడత శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రెటరి వేమూరి రామ్మోహన్ రావు, విఆర్ఒ రఫీ, సుబ్బారావు పాల్గొన్నారు

ఈకేవైసీ పూర్తి చేయాలి

ప్రజాశక్తి -కారంచేడు

మండల పరిధిలోని అన్ని పంచాయతీలలో పెండింగ్లో ఉన్న ఈకేవైసీలు పూర్తి చేయాలని ఎంపిడిఒ కె. నేతాజీ చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ గ్రామంలో స్థానికంగా నివాసం ఉండే వారి ఈకేవైసీ పూర్తి చేయాలని కార్యదర్శులకు సూచించారు. చిన్న పిల్లల ఆధార్ సీడింగ్‌ను పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదవాలి

చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి గంగాధర్ రావు

ప్రజాశక్తి - పంగులూరు

ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించి తమ తల్లిదండ్రుల కళ్ళల్లో ఆనందాన్ని చూడాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి డి. గంగాధర్ రావు తెలిపారు. కీర్తిశేషులు వడ్డవల్లి అజిత్ కుమార్ 51 జయంతి సందర్భంగా పంగులూరు మండలంలో 2024-25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యధిక మార్పులు సాధించిన విద్యార్థులకు అజిత్‌కుమార్ చారిటబుల్ ట్రస్టు తరపున అభినందన సభ మంగళవారం నిర్వహించారు. చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని అజిత్ కుమార్ స్మారక గ్రంథాలయంలో ఈ సభ నిర్వహించారు. ఈ సభకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు చందలూరు గిరిజ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గంగాధర్ రావు మాట్లాడుతూ ట్రస్ట్ ద్వారా వడ్డవల్లి వీరనారాయణ విద్యారంగానికి సేవలందించడం ద్వారా కీర్తిశేషులు అజిత్ కుమార్ ఎప్పటికీ చిరంజీవి గానే ఉంటారని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలోని పాఠశాలల్లో ఉత్తమ విద్యార్థులను ప్రోత్సహిస్తూ వారికి చేయూతనిస్తున్న అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ఈ ప్రాంత విద్యార్థులకు ఓ వరమని తెలిపారు. ట్రస్ట్ తరఫున పాఠశాలలో గ్రంథాలయం నిర్మించి విద్యార్థులకు ప్రోత్సాహాన్ని ఉత్సాహాన్ని అందిస్తున్న వడ్డవలి వీరనారాయణను అభినందించారు. పదవ తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచి మంచి మార్కులు సాధించిన విద్యార్థులు, అదే పట్టుదలతో, అదే కార్యదీక్షతో ఇంటర్ ఆపై చదువుల్లో కూడా మంచి ప్రతిభ కనబరచాలన్నారు. తమ తల్లిదండ్రులను, చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఆనంద పరచాలన్నారు. విశ్రాంత ప్రిన్సిపల్ బీరం సుందర్‌రావు మాట్లాడుతూ కార్పొరేట్ ఆధిపత్యం కొనసాగుతున్న ఈ రోజుల్లో గ్రామీణ ప్రాంతంలో 450 మంది విద్యార్థులను పాఠశాలకు పంపి ప్రభుత్వ విద్యను ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులను, వారికి విద్యతోపాటు మంచి క్రమశిక్షణ కూడా నేర్పుతున్న ఉపాధ్యాయులు అభినందనీయులని తెలిపారు. సమాజంలో తెలివైన వాళ్ళు, ప్రతిభావంతులు,బాగా చదువుకున్న వాళ్ళు అనేకమంది ఉన్నారని, అలాంటి వారిని గుర్తించి అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు.తమ కుమారుడి జ్ఞాపకార్థంగా విద్యారంగ అభివృద్ధికి కషి చేస్తున్న వడ్డవల్లి వీరనారాయణను అభినందించారు. విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ బత్తుల వీరనారాయణ మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి పదవ తరగతి పునాది లాంటిదని తెలిపారు. పదవ తరగతిలో మంచి ప్రతిభను కనపరిస్తే, భవిష్యత్తుకు మంచి బాట వేసుకున్నట్లేనని తెలిపారు. తొలుత అజిత్ కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పదవ తరగతిలో మంచి ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, షీల్డ్ , బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా రేష్మ ,సుస్మిత ప్రదర్శించిన భరతనాట్యం అందరినీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఇంజినీర్ పేర్ని వీరనారాయణ, పంగులూరు-2 ఎంఇఒ జి. వీరాంజనేయులు, అజిత్ కుమార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వడ్డవల్లి వీరనారాయణ, డాక్టర్ కొర్రపాటి సుధాకర్, విశ్రాంత హెచ్ఎం నార్నె తాతయ్య, కొండ మంజులూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఇమ్మడిశెట్టి అనిత, గంగవరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సమత, ఇంకొల్లు-2 ఎంఇఒ శ్రీనివాస్, డాక్టర్ కె. రఘుచంద్, వివిధ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి గంగాధరరావు

బైటమంజులూరులో సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి - పంగులూరు.

మండల పరిధిలోని బైట మంజులూరు గ్రామంలో సమ్మర్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు క్యాంపు నిర్వాహకులు విశ్రాంత ఉపాధ్యాయుడు బి. రామాంజనేయులు, అంగన్‌వాడీ కార్యకర్త బి. సుజాత మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మర్ క్యాంపు బైట మంజులూరు ప్రభుత్వ పాఠశాలలో ఈ నెల 29 ,30 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి12 గంటల వరకు, సాయంత్రం మూడు గంటల నుంచి 5 గంటల వరకూ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా 8, 9 ,10 తరగతి విద్యార్థులకు గణితంలో సులభ పరిచయ కార్యక్రమం ఉంటుందన్నారు.నాగార్జున యూనివర్సిటీ గెస్ట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ .లెనిన్ బాబు సారథ్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

ముగిసిన ఎపి ఈసెట్ పరీక్షలు

ప్రజాశక్తి వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఈనెల 19 నుంచి 27 వరకూ నిర్వహించిన ఎపి ఇంజినీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు కళాశాల కళాశాల సెక్రటరీ వనమా రామకష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హైయర్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో జెయన్‌టియు కాకినాడ వారి పర్యవేక్షణలో ఈ పరీక్షలు నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ కె. జగదీష్ బాబు తెలిపారు. ఫార్మసీ, అగ్రికల్చరల్ ఇంజినీరింగ్‌లో చేరబోయే అభర్థులకు ఆన్‌లైన్‌లో ఈ పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు మొత్తం 240 మందికి 234 అభ్యర్థులు హాజరైనట్లు ప్రిన్సిపల్ తెలిపారు.



మాట్లాడుతున్న సిడిపిఒ సుచిత్ర

బాలికా వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-రేపల్లె

సైబర్ నేరాల పట్ల కిశోర వికాసం బాలికలు పూర్తి అవగాహన కలిగి ఉండి, తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిడిపిఒ ఎం. సుచిత్ర తెలిపారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం వద్ద కిశోర వికాసం సమ్మర్ కాంపెయిన్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ సుచిత్ర మాట్లాడుతూ ఆన్‌లైన్ మోసాలు, బాల్యవివాహాలు జరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కిశోర బాలికలు ఓ లక్ష్యాన్ని ఏర్పరచుకొని లక్ష సాధనకై కషి చేయాలన్నారు. బాలల లైంగిక పునరుత్పత్తి మరియు ఆరోగ్య హక్కు పై, సైబర్ నేరాలపై బాలబాలికలు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాల బాలికలు అత్యాచారాలకు, సైబర్ నేరాల బారీనపడితే వాళ్ళ చైల్డ్ హెల్ప్ లైన్‌ను ఉపయోగించుకోవాలన్నారు. బాల్య వివాహాల వలన కలిగే అనర్థాలు మరియు సంక్రమించే వ్యాధుల గురించి బాలికలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగలక్ష్మి , కిరణ్ షా, మహిళసంరక్ష కార్యదర్శి,రోజా, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

కొల్లూరు: బాలికలు సెల్‌ఫోన్ వినియోగంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొల్లూరు సెక్టర్ ఐసిడిఎస్ సూపర్‌వైజర్ జయలక్ష్మి తెలిపారు. పెదలంక అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికా వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ బాలికలు తమ వ్యక్తిగత వివరాలను ఆన్‌లైన్‌లో షేర్ కూడదని తెలిపారు. పరాయి వ్యక్తులతో సెల్‌ఫోన్‌లో ఎక్కువ సేపు సంభాషణలు జరుపరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సిబ్బంది, కిశోర బాలికలు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అద్దంకమ్మ తిరునాళ్ల

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు గ్రామంలో కొలువైయున్న శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి తిరునాళ్ల మంగళవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంకుమ, గాజులు సమర్పించారు. వివిధ గ్రామాల్లో ఉన్న బంధుమిత్రులు గ్రామానికి చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. అమ్మవారిని దర్శించుకుని విశేష పూజలు, అర్చనలు చేయించుకున్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఆలయ 33వ వార్షికోత్సవం సందర్భంగా తిరునాళ్ల నిర్వహించారు. అమ్మవారి కుంకుమ బండ్లు కొల్లవారిపాలెం గ్రామం నుంచి ఊరేగింపుగా పర్చూరు ఆలయం వరకూ తీసుకొచ్చారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సిడిమాను రథాన్ని ఏర్పాటు చేసి భక్తుల దర్శనార్థం గ్రామంలో ఊరేగించారు.. అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. సాంస్కతి కార్యక్రమాల్లో భాగంగా కోలాట, భజన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కార్యనిర్వాహణ అధికారి దామా నాగేశ్వరరావు, వంశ పారంపర్య ధర్మకర్త కొల్లా సుబ్బారావు, ఆలయ పూజారులు తులసి పర్యవేక్షించారు. సిడిమాను రథం ఊరేగింపు సందర్భంగా ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా ఎస్ఐ మాల్యాద్రి సారథ్యంలోని పోలీస్ సిబ్బంది తగు చర్యలు చేపట్టారు.



తిరునాళ్లలో పాల్గొన్న ప్రజలు

ఎక్సైజ్ పోలీసుస్టేషన్‌లో తనిఖీ

ప్రజాశక్తి - నగరం

జిల్లా ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఆఫీసర్ బి.వెంకటేశ్వరరావు నగరంలోని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్‌ను మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించారు. నవోదయం 2.0 కార్యక్రమంలో బాగంగా హ్యాబిట్యుయల్ అఫెండర్స్, బైండ్ ఓవర్స్ మరియు రిహాబిటేషన్స్ గురించి విచారించారు. అనంతరం మద్యం దుకాణాల లైసెన్సు దారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. తప్పనిసరిగా ఎంఆర్‌పి ధరలకే మద్యం విక్రయాలన్నారు. సమయపాలనను తప్పనిసరిగా పాటించాలన్నారు. రాత్రివేళ షాపుల వద్ద అమ్మకాలు లేకుండా చూడాలన్నారు. షాపుల వద్ద అతికించిన క్యూఆర్ కోడ్‌లను కొనుగోలుదారుల చేత ప్రతి రోజు తప్పని సరిగా స్కానింగ్ చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో నగరం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మార్టురి శ్రీరాం ప్రసాద్ , మద్యం దుకాణాల లైసెన్సు దారులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల గుర్తింపునకు ఇంటింటి సర్వే

ప్రజాశక్తి- అద్దంకి

ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు మెరుగైన విద్యను అందించేందుకు జిల్లా సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో మండలంలో ఈ నెల 13 నుంచి జూన్ 9 వరకూ ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను (న్యూ ఎన్రోల్ మెంట్ డ్రైవ్) గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంఇఒ బూదాటి సుధాకరరావు తెలిపారు. బడిఈడు పిల్లలు బడిబయట ఉండకూడదని,పాఠశాలలోనే ఉండాలనే ఉద్దేశ్యంతో 0 నుంచి 18 సంవత్సరాల లోపు వినికిడి లోపం, దష్టిలోపం, మానసిక వైకల్యం, శారీరక అంగవైకల్యం, ఆటిజం, 21 రకాల వైకల్యాలు పిల్లలను గుర్తించి వారిని సమీప ప్రభుత్వ పాఠశాలలో నమోదు చేయించనున్నట్లు తెలిపారు. సర్వేలో భాగంగా అద్దంకి గుర్రాల కాలనీలో భవిత కేంద్రం ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా ఇంటింటిని సందర్శించినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వైకల్యం కలిగిన ముగ్గురు పిల్లలను గుర్తించినట్లు తెలిపారు. వారిని భవిత కేంద్రంలో చేర్పించి వారి మానసిక ఎదుగుదలకు కృషి చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కొంగల శ్రీనివాసు, పాలపర్తి యోనా పాల్గొన్నారు.

కొల్లూరు : సమగ్ర శిక్ష సిబ్బంది ఆధ్వర్యంలో ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. ఎపిసి నాగిరెడ్డి ఆదేశాల మేరకు భవిత కేంద్రం ఉపాధ్యాయులు ధనరాజ్, ఆంటోనమ్మ మండలంలోని పలు గ్రామాల్లో సర్వే నిర్వహించిన పిల్లలను గుర్తిస్తున్నారు. అందులో భాగంగా కొల్లూరు గౌడ్ పాలెం అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో మంగళవారం సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ధనరాజు మాట్లాడుతూ 8 సంవత్సరాల లోపు విభిన్న ప్రతిభావంతులైన పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించి మెరుగైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త సొంటి ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు



ఇంటి సర్వే నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

గ్రేడ్-2 హెడ్ మాస్టర్ ఉద్యోగోన్నతి

సీనియారిటీ జాబితా సవరించాలి

యుటిఎఫ్ డిమాండ్

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలకు సంబంధించి స్కూల్ అసిస్టెంట్ నుంచి గ్రేడ్-2 హెడ్మాస్టర్ ఉద్యోగోన్నతుల జాబితా రూపొందించడంలో అనేక పొరపాట్లు దొర్లాయని, వాటిని తక్షణం సరిచేయాలని యుటిఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు షిఫ్ట్ షేక్ అబ్దుల్‌హై మంగళవారం నాడు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. డీఎస్సీ 1994 ద్వారా సెకండరీ గ్రేడ్ టీచరుగా ఉద్యోగంలో చేరి 2002లో స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్)స్కూల్ అసిస్టెంట్(పిఎస్) స్కూల్ అసిస్టెంట్ (ఇంగ్లీష్)గా పదోన్నతులు పొంది.. 2002 నవంబర్ 1 నాటికి ఉద్యోగంలో చేరారు. వీరు గ్రేడ్-2 హెచ్ఎంగా పదోన్నతి పొందే సందర్భంలో వారి సీనియార్టీని నిర్ణయించడంలో అనేక పొరపాట్లు చోటు చేసుకున్నాయని పేర్కొన్నారు. పదోన్నతుల సీనియారిటీ జాబితా మెరిట్ ప్రకారం ఇవ్వమంటే సెటిల్ సీనియారిటీ,దానిని మార్చలేమని, డిఇఒ కార్యాలయం తేల్చిందని వారు పేర్కొన్నారు. డీఈవో కార్యాలయం పేర్కొనే సెటిల్ సీనియారిటీ మెరిట్ కం రోస్టర్ విధానంలో ఉందని, దాని అమలులో కూడా లోపాలు ఉన్నాయని ఆరోపించారు. అమలులో స్కూల్ అసిస్టెంట్ కు సంబంధించిన ఫీడర్ క్యాడర్ సీనియారిటీ పరిగణనలోకి తీసుకోవలసి ఉండగా స్కూల్ అసిస్టెంట్ (మ్యాథ్స్), స్కూల్ అసిస్టెంట్ (పిఎస్) స్కూల్ అసిస్టెంట్(ఇంగ్లీష్) సీనియారిటీని ఆయా సబ్జెక్టుల పదోన్నతి జాబితాలో ర్యాంకులు ఆధారంగా జాబితా రూపొందించారని, ఇది నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఆర్ సి నెంబర్ 142 /సి 3-1/2011 /11-8-2011/సిఎస్సి ఏపీ ప్రకారం రూల్ 33 అండ్ 34 ఆఫ్ ఏపీ సభార్డినేట్ సర్వీస్ రూల్స్ ప్రకారం స్కూల్ అసిస్టెంట్ నుండి గ్రేడ్-2 హెచ్ఎంగా పదోన్నతుల జాబితా తయారు చేయునప్పుడు ఎస్ఏ (స్కూల్ అసిస్టెంట్ లు) ఒకే డీఎస్సీ ద్వారా ఎస్జీటీ గా ఉండి ఒకే తేదీన జాయిన్ అయితే ఫీడర్ కేడర్ తీసుకోమని ఉత్తర్వులు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం డీఈవో, ఆర్‌జెడిలను సంప్రదించగా అలా వీలు కాదని తెలిపారన్నారు. అయితే ఈ అంశంపై రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొమ్మోజు శ్రీనివాసరావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ ప్రసాద్ ముఖ్య కార్యకర్తలు రెండు దఫాలు జాయింట్ డైరెక్టర్ (సర్వీస్) సుబ్బారెడ్డిని కలవగా జెడి అబ్రహంతో మాట్లాడగా వారు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం ఒకే డీఎస్సీలో నియామకం పొంది వివిధ సబ్జెక్టులకు పదోన్నతి పొంది ఒకే తేదీన జాయిన్ అయినా ఎస్ఏ సీనియార్టీని నిర్ణయించేటప్పుడు వారి సీనియారిటీని పీడర్ క్యాడర్ తీసుకోవాలని జేడీ ఆదేశాల మేరకు ప్రకాశం జిల్లా డీఈవో కిరణ్ కుమార్ సంసిద్ధత వ్యక్తం చేసారని, స్కూల్ అసిస్టెంట్ నుండి హెడ్మాస్టర్ పదోన్నతులు జాబితా బుధవారం సరిచేస్తామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. వెంటనే జాబితాను సరిచేసి గ్రేడ్-2 హెచ్ఎం ల పదోన్నతి జాబితా విడుదల చేయాలని యుటిఎఫ్ ప్రకాశం జిల్లా శాఖ డిమాండ్ చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

మహిళా శక్తిని

సమాజ చోదకశక్తిగా మార్చండి

- డిఆర్‌డిఏతో బ్యాంకర్లు సమన్వయం చేసుకోవాలి
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ తమీమ్ అన్సారియా



మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మహిళా శక్తిని కుటుంబ, సమాజ చోదక శక్తిగా మార్చేందుకు ప్రభుత్వం ప్రత్యేక దష్టి పెట్టినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా తెలిపారు. బ్యాంకర్లు కూడా స్వయం సహాయక సంఘ (ఎస్.హెచ్.జి) సభ్యులకు ఈ దిశగా రుణాలు ఇచ్చి అండగా నిలవాలని కోరారు. ఎస్‌హెచ్‌జి మహిళలకు 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఇచ్చే వార్షిక రుణ, జీవనోపాధి కార్యాచరణ ప్రణాళికపై మంగళవారం ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో డిఆర్‌డిఏ, మెప్మా అధికారులతోనూ, బ్యాంకర్లతోనూ కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణాల మంజూరులో ఎలాంటి జాప్యం చేయవద్దని, దరఖాస్తును ఆమోదించడమో.. తిరస్కరించటమో.. చేయాలి తప్ప పెండింగ్లో పెట్టవద్దని స్పష్టం చేశారు. ఎల్‌డిఎం రమేష్, డిఆర్‌డిఏ పీడీ నారాయణ, మెప్మా పీడీ శ్రీహరి, డిఆర్‌డిఏ డిపిఎంలు, ఎపిఎంలు పాల్గొన్నారు.

● మహానాడులో ఎమ్మెల్యేలు



కడపలో నిర్వహిస్తున్న తెలుగుదేశం మహానాడులో పాల్గొన్న ఎమ్మెల్యేలు దామచర్ల జనార్ధన్, ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి, బిఎన్.విజయ్‌కుమార్

కోరిశపాడు రిజర్వాయర్ పనులు వేగవంతం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

కోరిశపాడు రిజర్వాయర్ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి అధికారులను ఆదేశించారు. యర్రం చినపోలిరెడ్డి ఎత్తిపోతల పథకం పనుల పురోగతిపై మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ జె. వెంకటమురళి అధికారులతో సమీక్ష నిర్వహించారు. గుండ్లకమ్మ రిజర్వాయర్ నుండి 1.33 టీఎంసీలతో బాపట్ల జిల్లా పరిధిలోని 20 వేల ఎకరాల ఆయకట్టుకు నీరు అందించే లక్ష్యంతో ఎత్తిపోతల పథకం ద్వారా కొరిశపాడు రిజర్వాయర్ ఏర్పాటుకు ప్రభుత్వం నిర్దేశించిందన్నారు. వాటికి సంబంధించిన పనులపై ఆయన సంబంధిత ఇంజనీర్లను ఆరా తీశారు. రిజర్వాయర్ పనులలో మిగిలిన పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జిల్లా కలెక్టర్ కు వివరించారు. సమావేశంలో కందుల ఓబుల్ రెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు ప్రత్యేక ఉప కలెక్టర్ సిహెచ్ విజయ జ్యోతి కుమారి, చీరాల రెవెన్యూ డివిజన్ అధికారి చంద్రశేఖర్, గుండ్లకమ్మ రిజర్వాయర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు జె. శ్రీహరి, ఎం రవి, డిఇ లు ఏఈలు పాల్గొన్నారు.

రీసర్వే దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

రెవెన్యూ సదస్సులు రీసర్వేలో నమోదైన దరఖాస్తులను తక్షణమే పరిష్కరించాలని సిసిఎల్ఏ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జి జయలక్ష్మి తెలిపారు. రెవెన్యూ అంశాలపై మంగళవారం రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. వీక్షణ సమావేశం ద్వారా జిల్లా నుంచి కలెక్టర్ జె.వెంకటమురళి హాజరయ్యారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని జయలక్ష్మి చెప్పారు. పర్యావరణ విపత్తు సమయంలో ఏదైనా సంఘటనలు జరిగితే తక్షణమే ఏపీ రాష్ట్ర పర్యావరణ విపత్తు నిర్మూలన, నిర్వహణ సంస్థకు సమాచారం ఇవ్వాలన్నారు. సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, ఉప కలెక్టర్లు లవన్న, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'అన్నదాత సుఖీభవ' ప్రక్రియ పూర్తి చేయండి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను తక్షణమే పూర్తి చేయాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. వచ్చే నెలలో ఈ పథకంలో లబ్ధిదారుల ఖాతాలలో నిధులను ప్రభుత్వం జమ చేయనున్నందున క్షేత్రస్థాయిలో వ్యవసాయ, రెవిన్యూ సిబ్బంది సమన్వయంతో దీనిపై దృష్టి పెట్టాలని ఆమె దిశానిర్దేశం చేశారు. మంగళవారం ప్రకాశం భవనం నుంచి మండలస్థాయి అధికారులతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అన్నదాత సుఖీభవ, సిసిఆర్‌సి కార్డుల మంజూరుపై క్షేత్ర స్థాయి అధికారులకు ఆమె పలు ఆదేశాలు జారీ చేశారు. సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ మాట్లాడుతూ సిబిజి, ఎంఎస్ఎంఇ ఇతర పరిశ్రమల స్థాపనకు అవసరమైన భూములను గుర్తించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ లో డిఆర్ఒ చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు శ్రీధర్, వరకుమార్, జాన్సన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతికూల వాతావరణ పరిస్థితులతో

జగన్ పర్యటన వాయిదా

- త్వరలో మరో తేదీని ప్రకటిస్తాం..
- ఎమ్మెల్యే బూచేపల్లి, మాజీ ఎమ్మెల్యే అన్నా..



మాట్లాడుతున్న బూచేపల్లి

ప్రజాశక్తి-పొదిలి

పొదిలిలో బుధవారం జరగనున్న మాజీ ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన ప్రతికూల వాతావరణ పరిస్థితులు, భారీ వర్షాల కారణంగా వాయిదా వేయడం జరిగిందని, త్వరలో మరో తేదీని ప్రకటిస్తామని ప్రకాశం జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, దర్శి శాసనసభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, వైసిపి మార్కాపురం ఇన్‌ఛార్జి అన్నా రాంబాబు తెలిపారు. జగన్ పర్యటన వాయిదా సందర్భంగా స్థానిక హెలీప్యాడ్ వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రెండు రోజుల పాటు అల్పపీడనం కారణంగా వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో హెలికాప్టర్ దిగేందుకు అధికారుల అనుమతి లేదని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో వాతావరణం అనుకూలించిన వెంటనే వారం లోగా జగన్ పర్యటన ఖరారవుతుందన్నారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి చాలా దయనీయంగా ఉందని, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆర్థిక ఇబ్బందుల్లో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రైతులకు అండగా ఉండేందుకే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రైతుల పక్షాన పోరాటం చేసేందుకు వస్తున్నారని వివరించారు. కంభం మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు బత్తుల బ్రహ్మానందరెడ్డి మాట్లాడుతూ వాతావరణ పరిస్థితులు చక్కబడిన వెంటనే జూన్ మొదటి వారంలో జగన్ పర్యటన ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పంచాయతీరాజ్ వింగ్ కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కెవి రమణారెడ్డి, వెలిగండ్ల వైస్ ఎంపీపీ గుంటక తిరుపతిరెడ్డి, మాజీ పిడిసిసి బ్యాంక్ చైర్మన్ వైఎం ప్రసాద్ రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్లు వై వెంకటేశ్వరరావు, కె.వి.రెడ్డి, గుజ్జుల సంజీవరెడ్డి, ఎస్కే మస్తాన్ వలి, రబ్బాని, కొత్తపులి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

జైలు జీవితంతో పరివర్తనకు అవకాశం

జిల్లా జైలును సందర్శించిన ఎస్‌పి దామోదర్



జిల్లా జైలులో పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జైలు జీవితం కేవలం శిక్ష మాత్రమే కాదని, ఆత్మ పరిశీలనకు, పరివర్తనకు ఒక అవకాశమని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ తెలిపారు. జిల్లా జైలు భద్రత దష్ట్యా మంగళవారం ఎస్‌పి ఒంగోలులోని జిల్లా జైలును మంగళవారం సందర్శించారు. జిల్లా కారాగారం పరిసరాలను, ఖైదీల గదులు, జైలు హాస్పిటల్, అన్ని ప్రదేశాలను తిరిగి జిల్లా ఎస్‌పి పరిశీలించారు. అనంతరం జైలులో అంతర్గత భద్రతపై జైలు అధికారులు, సెక్యూరిటీ సమీక్ష కమిటీ అధికారులతో జిల్లా ఎస్‌పి సమావేశం నిర్వహించారు. సమావేశంలో జైలులో ప్రస్తుతం ఉన్న భద్రతా వ్యవస్థ, భవిష్యత్తులో తీసుకోబోయే చర్యలు మరియు ఇతర విషయాలపై చర్చించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ జైలు భద్రత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా అత్యున్నత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. మహిళా ఖైదీలకు ప్రత్యేక భద్రత ఉండేలా చూడాలని, జైలు పరిసరాలు పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచుకోవాలన్నారు. ఎస్‌పి వెంట జైలు సూపరింటెండెంట్ పి. వరుణారెడ్డి, డిఎస్‌పి ఆర్. శ్రీనివాసరావు, ఎఆర్ డిఎస్‌పి శ్రీనివాసరావు, ఒంగోలు తాలూకా సిఐ విజయ కృష్ణ, వన్‌టౌన్ సిఐ నాగరాజు, టూటౌన్ సిఐ ఎం. శ్రీనివాసరావు, ట్రాఫిక్ సిఐ వై. పాండు రంగారావు, ఆర్‌ఐ సీతారామి రెడ్డి, జిల్లా జైలర్ రమేష్, యం.శ్రీనివాసరావు, యన్.శ్రీనివాసరావు, కారాగార వైద్యాధికారి బ్రహ్మతేజ ఉన్నారు.

యోగాతో మానసిక ఉల్లాసం: కలెక్టర్



యోగా చేస్తున్న కలెక్టర్ వెంకటమురళి

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మనిషి దైనందిన జీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని, యోగా చేయడం వల్ల ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం లభిస్తుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. యోగాంధ్ర క్యాంపెయిన్ లో భాగంగా మంగళవారం పట్టణంలోని రథం బజారులో యోగా కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ యోగా మన దైనందిన జీవితంలో భాగం చేసుకొని దీనిని ఒక అలవాటుగా చేసుకోవాలన్నారు. జిల్లాలో మే 21వ తేదీ నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్ర 2025 క్యాంపెయిన్ ను నెల రోజులపాటు యోగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. జూన్ 21న సూర్యలంక, రామాపురం బీచ్‌లో అంతర్జాతీయ యోగా దినోత్సవం నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమానికి హాజరైన అధికారులు, విద్యార్థులతో ట్రైనర్లు యోగాసనాలు వేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి గంగాధర్ గౌడ్, పిడి డిఆర్డిఏ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, పర్యాటక శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఇన్చార్జి లవన్న, బాపట్ల మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, బాపట్ల తహసీల్దార్ సలీమా పాల్గొన్నారు.